ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

శనివారం 9 నవంబరు 2024





3 లక్షలకు తగ్గాయి..

- పట్టభద్రుల దరఖాస్తులకు ముగిసిన గడువు
- ప్రత్యేక సాఫ్టువేర్‌తో మల్టిపుల్ ఎంట్రీల తొలగింపు

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజక వర్గ శాసనమండలి ఎన్నిక కోసం దాఖలైన దరఖాస్తుల్లో మల్టిపుల్ ఎంట్రీలు వేలల్లో లెక్క తేలాయి. దాదాపుగా 43 వేలకు పైగా దరఖాస్తులు డబుల్, ట్రిపుల్ ఎంట్రీలు తేలాయి. దీంతో వాటిని ప్రత్యేక సాఫ్టువేర్ ద్వారా గుర్తించి ఏఈఆర్‌వో లాగిన్ల నుంచి ఎన్నికల సంఘం తొలగించింది. దీంతో దరఖాస్తుల సంఖ్య 3.43 లక్షల నుంచి 3 లక్షలకు తగ్గాయి. దరఖాస్తులు దాఖలు చేయడానికి గడువు తేదీ ఈ నెల 6వ తేదీ సాయంత్రం ముగియడంతో ఏఈఆర్‌వో, ఈఆర్‌వో లాగిన్లు ఫ్రీజ్ అయిపోయాయి. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ కావడంతో ఫారం-18 దాఖలుకు సీఈవోఆంధ్ర వెబ్‌సైట్‌లో అవకాశం ఉన్నది. అయితే గడువు తేదీ దాటిన తర్వాత దాఖలైనవి అధికారుల పరిశీలనకు రావు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం క్లెయిమ్‌లు/అభ్యంతరాల సమయంలో వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటుహక్కు కోసం గడువు ముగిసిన నేపథ్యంలో వాటి పరిశీలనని ఈసీ చేపట్టింది. తొలుత సాఫ్టువేర్ ద్వారా బహుళ దరఖాస్తులను తొలగించింది. దాంతో బాపట్ల జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా 20851, ఆఫ్‌లైన్‌లో 563, ఏలూరులో 13983, 1175, గుంటూరులో 92829, 1079, కృష్ణలో 49160, 6687, ఎన్‌టీఆర్‌లో 57268, 4801, పల్నాడు జిల్లాలో 49342, 2850 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఆన్‌లైన్‌లో వచ్చిన వాటిల్లో ఇప్పటివరకు 6394 దరఖాస్తులను ఆమోదించారు. ఏఈఆర్‌వోల వద్ద 268029, ఈఆర్‌వో వద్ద 8983 పెండింగ్‌లో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో వచ్చిన వాటిల్లో 27 దరఖాస్తులను తిరస్కరించారు. ఆఫ్‌లైన్‌లో దాఖలైన 17,155లో 728 ఆమోదించారు. 16427 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక బృందాలు

దరఖాస్తుల దాఖలుకు గడువు ముగిసిన దృష్ట్యా వాటి పరిశీలనకు ప్రత్యేక బృందాలను ఎన్నికల అధికారులు నియమించారు. బీఎల్‌వో క్షేత్ర పరిశీలనకు వెళ్లినప్పుడు కేవలం ఒరిజినల్ డిగ్రీ మాత్రమే పరిశీలించాలని ఈఆర్‌వో ఎస్ఎస్‌కే కాజావలి తెలిపారు. నివాస ధ్రువీకరణ కోసం ఓటరు ఐడీ/ఆధార్ మరే పత్రం అయినా సరిపోతుందన్నారు. ఎన్నికల సంఘం గుర్తించి 59 యూనివర్సిటీలలో దేని నుంచి డిగ్రీ ఉన్నా ఆమోదించాలన్నారు. అవి కానప్పుడు ప్రత్యామ్నాయం కూడా సూచించడం జరిగిందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించేందుకు తహసీల్దార్లు, ఎంపీడీవోలను ఏఈఆర్‌వోలుగా ఎన్నికల సంఘం నియమించింది. ఈ నేపథ్యంలో వారు దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలన చేయించేందుకు చర్యలు చేపట్టాలి. ఏఈఆర్‌వోల లాగిన్‌లోనే సింహభాగం 2,68,029 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ దృష్ట్యా బీఎల్‌వోలను వెంట పడి దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి రి మార్కులతో వాటిని ఈఆర్‌వో లాగిన్‌కు పంపాల్సి ఉన్నది.



తెనాలి: కొల్లిపర వద్ద ట్రాక్టర్లకు ఇసుక ఎత్తుతున్న కూలీలు

ఉచితమని వస్తే ఊరుకోం

ఇసుక ఉచితం.. ప్రభుత్వం ప్రకటించింది.. ముఖ్యమంత్రి చెప్పారు.. అని వస్తే ఊరుకునేది లేదు. మా ఇసుక, మా ఇష్టం.. అంటూ రీచ్‌ల వద్ద నేతలు, ఇసుక అక్రమార్కులు బరితెగిస్తున్నారు. ఉచిత ఇసుక విధానం.. నేతలకు, అక్రమార్కులకు వరంగా మారింది. సీఎం చెప్పినట్లుగా సొంత అవసరాల కోసం రీచ్‌ల వద్దకు వెళ్తే అక్కడి వారి దౌర్జన్యాలు, బెదిరింపులకు బలికావాల్సి వస్తోంది. సీఎం చెప్పారు మీరేంటని ఎదురు తిరిగితే నదిలోకి దిగితే పాతరేస్తామని తెనాలి పరిధిలోని రీచ్‌ల వద్ద కొందరు బరితెగిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా ఉచిత ఇసుక అమలు కావడంలేదు. వైసీపీ హయాంలో మాదిరిగానే ఇప్పుడు కూడా నేతలు ఇసుక పేరుతో కాసులు పోగేసుకుంటున్నారు. ఇసుక అక్రమాల విషయంలో గత వైసీసీకి, ప్రస్తుత ప్రభుత్వానికి పెద్ద తేడాలేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. సామాన్యులు ఇబ్బంది పడకుండా ఇసుక తెచ్చుకునేందుకు ప్రభుత్వం కల్పించిన వెసులుబాటును అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకుని దందా చేస్తున్నారు. మరోవైపు మరికొందరు పంచాయతీ, పోలీసుల పేరుతో అధికార దందా సాగిస్తున్నారు.

- నదిలోకి ట్రాక్టర్ దిగాలంటే రూ.500 కట్టాలి.
- అందరికంటే ముందు లోడ్ చెయ్యాలంటే రూ.600 అదనం.
- బయటి నుంచి వచ్చిన ట్రాక్టర్‌కు రూ.1500 చెల్లిస్తేనే ఇసుక.
- పంచాయతీల్లో జరిగే రోడ్ల నిర్మాణానికి ఇసుక కావాలంటూ పంచాయతీ కార్యదర్శుల పేరు, కార్యాలయ స్టాంప్‌తో లేఖలు
- పోలీస్‌నంటూ రాత్రుళ్లు రెండు లారీలతో ఇసుక తరలింపు
- పల్నాడు జిల్లాల్లో రాత్రిళ్లు వందల కొద్దీ లారీలతో యథేచ్ఛగా ఇసుక దోపిడీ

- రీచ్‌ల వద్ద నేతల బెదిరింపులు
- నదీ మార్గంలో గండికొట్టి మరీ దౌర్జన్యం
- నగదు ఇవ్వకుంటే ట్రాక్టర్ దిగనివ్వని వైనం
- అధికారం మారినా కొనసాగుతున్న ఇసుక దందా
- పట్టించుకోని అధికారులు.. యథేచ్ఛగా అక్రమాలు
- అక్రమార్కులకు వరంగా మారిన ప్రభుత్వ వెసులుబాటు

తెనాలి, బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమలు అవుతున్న ఉచిత ఇసుక విధానం. ఇసుక సామాన్యులకు కూడా సులభంగా అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్తూ.. ఇసుకలో నేతలు, వారి అనుచరులు జోక్యం చేసుకోవద్దని హెచ్చరిస్తున్నా ఆలకించే వారే లేరు. ఇసుక అక్రమ సంపాదనకు రుచిమరిగిన అక్రమార్కులు మాత్రం ఇంకా కాసులు దోచేస్తూనే ఉన్నారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువున, దిగువున ఇసుక అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ప్రజల సొంత అవసరాల కోసం నేరుగా రీచ్‌ల వద్దకు వచ్చి ఇసుకను తవ్వి ఎడ్లబళ్లు, ట్రాక్టర్లలో తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం వెసులుబాటు ఇవ్వగా ఇదే అవకాశంగా ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. నదులు, వాగులు, వంకల్లో మాత్రమే స్థానికులు తమ అవసరాలకు ఇసుకను తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంటే అసైన్డ్, పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు అక్రమార్కులు తెగబడి సొమ్ము చేసుకుంటున్నారు. సొంత అవసరాలకు ఇసుక కోసం ముందస్తు అనుమతి తీసుకుని పర్మిట్ ఉండాలని నిబంధన ఉన్నా వాటిని పట్టించుకునే వారే లేరు. ఈ తవ్వకాల వెనక కీలకంగా వ్యవహరిస్తున్నది పాలకపార్టీ ద్వితీయశ్రేణి నేతాగణమే కావడంతో వారిపై చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనకడుగు

(మిగతా 6వ పేజీలో..)



తెనాలి: అరవింద వారధి దగ్గర పెదలంక వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లు

హెచ్చరించినా.. తగ్గేదిలేదు..

బొమ్మువానిపాలెం, కొల్లిపర, మున్నంగి, అత్తలూరివారిపాలెం తదితర రీచ్‌ల వద్ద పక్షం రోజుల క్రితం వరకు ట్రాక్టర్‌కు రూ.వెయ్యి నుంచి రూ.1600 వరకు వసూలు చేశారనే ఆరోపణలతో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ పరిశీలించారు. ట్రాక్టర్‌కు రూ.600 మించి వసూలు చేయరాదని, అంతకు మించి వసూలు చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అయినా మరికొన్ని అడ్డదారులు సృష్టించుకుని వసూళ్లు మాత్రం ఆపలేదు. ఇసుక రీచ్‌లు ఉండే గ్రామాల పరిధిలోని ట్రాక్టర్‌లకు రూ.500 అదనంగా వసూలు చేస్తుంటే, బయట ప్రాంతాల నుంచి ఇసుక కోసం వచ్చే ట్రాక్టర్‌లకు రూ.వెయ్యి నుంచి రూ.1600 వరకు వసూలు చేస్తున్నారు. ముందుగా లోడింగ్ కావాలంటే అదనంగా రూ.600 చెల్లిస్తే కూలీలే ఆ వాహనం దగ్గరకు వెళ్లి ఇసుక లోడ్ చేస్తున్నారు.

దుగ్గిరాల కానిస్టేబుల్‌నని చెప్పి..

దుగ్గిరాల మండలం పెదకొండూరు దగ్గర గత వారం నుంచి ఓ వ్యక్తి తాను దుగ్గిరాల కానిస్టేబుల్‌ననిచెప్పి ఏకంగా లారీలతోనే ఇసుకను తరలించేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పెదకొండూరు రీచ్ నుంచి ట్రాక్టర్లతో ఇసుక తెచ్చుకుంటే బిల్లులు చూపాలని దౌర్జన్యం చేసి, అనుమతి లేని ట్రాక్టర్లను అడ్డుకుని లారీల్లో తమతోనే ఇసుక లోడ్ చేయించుకెళ్తున్నారని ట్రాక్టర్ల యజమానులు వాపోతున్నారు. అయితే అతడు నిజంగా పోలీసా! లేక ఆ పేరుచెప్పి దౌర్జన్యానికి పాల్పడుతున్న నకిలీనా అనేది తేలాలి. దీనిపై తెనాలి రూరల్ పోలీస్ ఉన్నతాధికారులను ప్రశ్నిస్తే మాత్రం తమ కానిస్టేబుల్ ఎవరూ రారని, ఒకవేళ ఎవరైనా కానిస్టేబుల్ పేరుచెప్పి ఇసుక దందాకు సిద్ధపడితే సమాచారం ఇవ్వాలన్నారు.



బాపట్ల రూరల్ పరిధిలో బధిరుల పాఠశాల వెనుక జరుగుతున్న ఇసుక తవ్వకాలు(ఫైల్‌ఫొటో)



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలో తలపడుతున్న బాలికలు

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

జీఐఎస్ పరిజ్ఞానంతో రాజధాని పనులు వేగవంతం

- ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్

6

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

- 9205 మంది విద్యార్థులకు 6923 మంది ఉత్తీర్ణత

ఐరన్ బిళ్లలు మింగి అపస్మారకస్థితి

- స్పృహతప్పి పడిపోయిన ఈపూరు ఎస్సీ హాస్టల్ విద్యార్థులు

8

చిలకలూరిపేటకు విడదల రజిని

- సొంత నియోజకవర్గానికి వెళ్లిన మాజీ మంత్రి
- తాడికొండకు బాలవజ్రబాబు నియామకం
- రెండు నియోజకవర్గాలకు వైసీపీ ఇన్‌చార్జిల మార్పు
- ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

మోటారు సైకిళ్ల దొంగల అరెస్టు

- 29 వాహనాలు స్వాధీనం చేసుకున్న నరసరావుపేట పోలీసులు

అంతర్ రాష్ట్ర గజదొంగ అరెస్టు

- రూ. పది లక్షల బంగారు, వెండి వస్తువులు స్వాధీనం
- నిందితుడిపై రాష్ట్ర వ్యాప్తంగా 150కి పైగా కేసులు

6

ఇంటి వద్దే.. ఈకేవైసీ

- అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్
- 67,810 మంది లబ్ధిదారులకు పంపిణీ
- రూ.1.76 కోట్లు లబ్ధిదారుల ఖాతకు జమ
- పక్కాగా దీపం-2 పథకం అమలన్న జేసీ సూరజ్



నరసరావుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి ఉచిత గ్యాస్ సిలిండర్‌ను పంపిణీ చేస్తాం. గ్యాస్ కనెక్షన్ వినియోగంలో ఉండి, ఇతర శాఖల డేటా బేస్‌తో రేషన్, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ అనుసంధానమై ఉన్నవారు ఉచిత గ్యాస్ సిలెండర్‌కు అర్హులు. అర్హుల ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు సంబంధిత గ్యాస్ కనెక్షన్‌కి లింకై ఉండాలి. ఈకేవైసీ కాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గ్యాస్ డెలివరీ సమయంలోనే డెలివరీ బాయ్ మొబైల్ యాప్ ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దే ఈకేవైసీ చేసేలా ఏజెన్సీలకు ఆదేశాలు జారీ చేశాం.' అని జాయింట్ కలెక్టర్ సూరజ్ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా దీపం-2 పథకాన్ని అమలు చేస్తుందన్నారు. అర్హులందరికీ ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 1,00,801 మంది దీపం-2 గ్యాస్ బుక్ చేసుకోగా 67,810 మందికి పంపిణీ చేశామన్నారు. వీరిలో ఇప్పటి వరకు 21,665 మంది లబ్ధిదారుల ఖాతాలకు గ్యాస్ సబ్సిడీ రూ.1,76,21,793 జమ చేశామన్నారు. ఈ పథకంలో ఇబ్బందులు తలెత్తితే లబ్ధిదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1967కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) లేదంటే మీ పరిధిలోని సచివాలయంలో కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లాలో 50 గ్యాస్ ఏజన్సీల పరిధిలో 7,06,997 మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారన్నారు. వారిలో జనరల్ గ్యాస్ కనెక్షన్లు 5,12,649, దీపం కనెక్షన్లు 1,66,067, సీఎస్ఆర్ పథకంలో 22,637, పీఎంయూవై కనెక్షన్లు 5,564 ఉన్నాయన్నారు. వీటిలో దీపం -2 పథకానికి 4,24,476 మంది అర్హులుగా ఉన్నారని తెలిపారు. ఉచిత పంపిణీ పథకం కింద జిల్లాలో ఏడాదికి రూ.163.440 కోట్లు భారం ప్రభుత్వంపై పడుతుందని జేసీ చెప్పారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు..

నియోజకవర్గం	కనెక్షన్లు
నరసరావుపేట	52,999
చిలకలూరిపేట	61,967
సత్తెనపల్లి	69,151
వినుకొండ	23,259
మాచర్ల	73,748
గురజాల	77,682
పెదకూరపాడు	64,670

వేగంలో, నాణ్యతలో రాజీ పడకూడదు

- పల్లె పండుగ పనుల తనిఖీలో ఎంపీ లావు

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ పనుల్లో వేగంలో, నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడకూడదని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. పల్లె పండగ అభివృద్ధి పనుల పురోగతి, నాణ్యతపై శుక్రవారం ఎంపీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల డైరెక్టర్ కృష్ణతేజతో కలిసి తనిఖీ చేశారు. మండలంలోని బొప్పూడి, మద్దిరాల, లింగంగుంట్లలో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, తాగునీటి పథకం, హార్టికల్చర్ పనులను తనిఖీ చేశారు. కాంట్రాక్టర్లు, అధికారుల నుంచి ఆయా పనులకు సంబంధించిన వివరాలు సేకరించారు. మద్దిరాల నవోదయ పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ పల్లె పండుగలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామని, ఆ పనుల తీరును పరిశీలించేందుకే ఆకస్మిక తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. రైతులు ఎంతో కాలంగా సాగు చేస్తున్న పత్తి, వరి, శనగ ఇతర పంటల కన్నా ఉద్యాన పంటల సాగు లాభ దాయకమని ఐఏఎస్ అధికారి కృష్ణతేజ చెప్పారు.

పల్లె పండుగ పనుల పురోగతిని తనిఖీ చేస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఐఏఎస్ కృష్ణతేజ



పొంతన లేని పన్నులు

- ఇల్లు, కుళాయి లేకున్నా నోటీసులు
- నరసరావుపేట మున్సిపాల్టీలో అస్తవ్యస్తం
- అసెస్‌మెంట్లు, కుళాయిలు లేకుండానే నమోదు
- ఆస్తి, నీటి పన్నుల ఆన్‌లైన్ ప్రక్రియలో గందరగోళం
- రూ.5 కోట్ల ఆదాయాన్ని సృష్టించి చెల్లించాలని ఒత్తిడి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) ఎక్కడైనా ఇల్లు ఉంటే ఆస్తిపన్ను వేస్తారు.. కుళాయి ఉంటే నీటి పన్ను చెల్లించాలి. కానీ ఇక్కడ విచిత్రంగా ఇల్లు లేకపోయినా రికార్డులో తాము నమోదు చేశాం కాబట్టి పన్ను కట్టాలని అధికారులు నోటీసులు ఇస్తున్నారు. తమకు మున్సిపాలిటీ నుంచి నీటి సరఫరా కావడంలేదు.. కుళాయి కోసం దరఖాస్తే చేసుకోలేదంటున్నా.. లేదులేదు నీటిపన్ను కట్టాల్సిందేనని అధి కారులు ఒత్తిడి చేస్తున్నారు. ఈ విచిత్రం నరసరావుపేటలో జరుగుతుంది. లేని ఆదాయాన్ని వారే సృష్టించి ఆ మేరకు పన్నులు వేసేసి అవి కట్టాలంటూ ప్రజలను మున్సిపల్ అధికారులు చేస్తున్న హడావుడిపై బాధితుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుంది. మున్సిపాల్టీలో ఉన్న గృహాలకు, కుళాయిలకు కార్యాలయ రికార్డులలో ఉన్న సంఖ్యకు పొంతన లేదు. నరసరావుపేట పురపాలక సంఘంలో ఆస్తి, నీటి పన్ను విధింపు గందరగోళంగా మారింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.11.90కోట్లు పన్ను వసూలుచేయాల్సి ఉంది. ఇందులో డబుల్ ఎంట్రీ అసెస్‌మెంట్లకు సంబంధించి సుమారు రూ.4కోట్లు, దాదాపు రూ.కోటి వరకు నీటి పన్ను ఉన్నట్లు మున్సిపల్ లెక్కలు తెలియజేస్తున్నాయి. అధికారులు తప్పులు చేసి ఆ భారం పన్నుదారులపై మోపుతున్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ముందు పన్ను చెల్లించండి తదుపరి మీ పేరుపై ఉన్న డబుల్ అసెస్‌మెంట్ తొలగిస్తామని అధికారులు చెపుతున్నారు. ఇప్పుడు పన్ను చెల్లిస్తే తాము అంగీకరించినట్లు అవుతుంది కదా అంటూ బాధితులు మండిపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు.

2004 నుంచే తప్పులు

2004కు ముందు ఉన్న రికార్డులను అధికారులు పరిశీలించగా తొలివిడతలోనే 1391 అసెస్‌మెంట్లు తప్పుగా ఉన్నట్లు నిర్ధారించారు. వీటికి సంబంధించి సూమారు రూ.3కోట్ల పన్ను డిమాండ్ నమోదైంది. అలాగే వందల సంఖ్యలో లేని కుళాయిలు ఉన్నట్లుగా నమోదు చేసి పన్ను విధించారని తేలింది. ఆ తర్వాత జరిగిన ఆన్‌లైన్ ప్రక్రియలో కూడా తప్పులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒక వ్యక్తికి ఒక కుళాయి ఉంటే రెండు ఉన్నట్లుగా రికార్డుల్లో చూపించారు. అలాగే ఒక వ్యక్తికి ఒక ఇల్లు ఉంటే రెండు ఇళ్లు ఉన్నట్లుగా నమోదు చేసి ఆ మేరకు పన్నులు చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. ఆ నోటీసులను అధికారులకు చూపించి లేని పన్నును తొలగించాలని పదేపదే కోరుతున్నా తమ మొర ఆలకించే వారే లేరని బాధితులు వాపోతున్నారు.

> **తప్పుల సవరణపై నిర్లక్ష్యం..**
> “పన్నుల్లో జరిగిన తప్పులను సరిదిద్దేందుకు కనీస ప్రయత్నాలు కూడా చేయడంలేదన్న విమర్శలున్నాయి. ఏడేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొన్నా అధికారులు నిర్లక్ష్యం వీడటంలేదు. ప్రత్యేక అధి కారి అనుమతితో డబుల్ ఎంట్రీలను సరిచేసే అధికారం కమిషనర్‌కు ఉన్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. లేని అసెస్‌మెంట్లు, అదనపు కుళాయిలను తగ్గించి వాస్తవ పన్ను డిమాండ్‌ను రూపొందించడంలేదు.”



జీఐఎస్ పరిజ్ఞానంతో రాజధాని పనులు వేగవంతం



జీఐఎస్‌పై వివరిస్తున్న అదనపు కమిషనర్ మల్లారపు నవీన్

తుళ్లూరు, నవంబరు 8: (ఆంధ్రజ్యోతి) ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి జీఐఎస్ సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తే నిర్మాణ పనులు శరవేగంగా సాగుతాయని ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్ అన్నారు. ఎస్రీ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం జీఐఎస్ మ్యాపింగ్ టెక్నాలజీపై విజయవాడ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో సంస్థ ఉద్యోగులకు కార్యశాల జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, జీఐఎస్ సాంకేతికతతో నిర్మాణాన్ని ఒక ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తి చేయగలమన్నారు. ఈ టెక్నాలజీని ఉద్యోగులు అందిపుచ్చుకొని అత్యున్నత లక్ష్యాలను అధిగమించాలన్నారు. నిత్య జీవితంలో చరవాణితో సాంకేతికతను ఏవిధంగా పెంపొందించుకుంటున్నామో అదేవిధంగా జీఐఎస్‌ను కూడా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్రీ ఇండియా ప్రతినిధి డాక్టర్ రమా చక్రవర్తి జీఐఎస్ మ్యాపింగ్ వినియోగాన్ని దృశ్య మాధ్యమం ద్వారా ఉద్యోగులకు వివరించి ఆవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యశాలలో ఏపీ సీఆర్డీ అధికారులు పాల్గొన్నారు.

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

పెదకాకాని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో బీఈడీ కోర్సుకు ఆగస్టులో నిర్వహించిన మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను పరీక్షల నియంత్రణ అధికారి ఎ.శివప్రసాదరావు శుక్రవారం విడుదల చేశారు. ఈ పరీక్షలకు 9205 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 6923 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఫలితాలను విశ్వవిద్యాలయ వెబ్ సైట్ నుంచి పొందవచ్చునని పేర్కొన్నారు. ఫలితాలకు సంబంధించి ఎవరైనా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.1680 చెల్లించి ఈ నెల 15వ తేదీ లోగా దరఖాస్తులను ఆయా కళాశాలలకు అందజేయాలని సూచించారు.

ఐరన్ మందు బిళ్లలు మింగి..
అపస్మారక స్థితిలో విద్యార్థులు

ఈపూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వసతి గృహంలో ఉంటూ ఈపూరు హైస్కూల్‌లో చదువుకుంటున్న 6వ తరగతి విద్యార్థులు చల్లా సతీష్, హనుగురు ఐరన్ టాబ్లెట్లు మింగి అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో గురువారం వైద్య సిబ్బంది పంపిణీ చేసిన ఐరన్ టాబ్లెట్లను హనుగురు, సతీష్ ఎవరు ఎక్కువ మింగితే వారు గెలిచినట్లు అని పందెం పెట్టుకొని మింగారు. హనుగురు 24, సతీష్ 10 టాబ్లెట్లు వేసుకున్నారు. సాయంత్రం పాఠశాలలో ఆడుకుంటూ స్పృహతప్పి హనుగురు పడిపోయాడు. ఉపాధ్యాయులు విద్యార్థిని ఈపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడ నుంచి నరసరావుపేట ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. సతీష్ కూడా వాంతులు చేసుకుంటుండడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి బాగానే ఉందని హాస్టల్ వార్డెన్ తెలిపారు.

లెదర్ పార్కు ఏర్పాటు చేస్తామంటే భూములు ఇస్తాం

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



పిల్లి మాణిక్యరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ప్రాంతంలో లెదర్ పార్కు ఏర్పాటు చేస్తామంటే స్థలం చూపుతామని, దీని ద్వారా ఈ ప్రాంతంలో వేల మందికి ఉపాధి లభిస్తుందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావును కోరారు. టీడీపీ వినుకొండ నాయకుల ఆహ్వానం మేరకు పట్టణానికి వచ్చిన మాణిక్యరావును పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. అనంతరం మాణిక్యరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే జీవీకి ఎప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దళితులకు సముచిత స్థానం, అవకాశాలు ఇచ్చిన ఏకైక పార్టీ తెలుగుదేశం మాత్రమేనని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక సభ్యుడుగా అనేక ఉద్యమాలతో జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు గుర్తింపు పొందారని కొనియాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చి తెలుగు దేశం పార్టీలో చేరి, పార్టీలో ఏ బాధ్యత అప్పగించినా సమర్థవంతంగా పని చేశారని, అధికార ప్రతినిధిగా సేవలు అందించారని ప్రశంసించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అయుబ్‌ఖాన్, పీవీ సురేష్, సమీమ్ ఖాన్, సౌదాగర్ జానీ బాష, గట్టుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచితమని వస్తే ఊరుకోం

(5 పేజీ తరువాయి)

వేస్తున్నారు. పల్నాడు జిల్లాల్లో అయితే రాత్రిళ్లు వందల కొద్దీ లారీల్లో ఏకంగా ఎక్స్‌కవేటర్లతో ఎత్తి ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పల్నాట రీచ్‌ల్లో తవ్వకాలకు అనుమతి లేకపోయినా నేతల ఘరానా దోపిడీ యథేచ్ఛగా సాగిపోతోంది. చాలా చోట్ల గత ప్రభుత్వంలో ఇసుక దందా నడిపిన వైసీపీ నాయకులు, వారి అనుచరులే మళ్లీ అక్రమాలకు పాల్పడుతుంటే, మరికొన్నిచోట్ల కూటమి నేతల పేరుచెప్పి వారి అనుచరులు ఇసుక దందాకు తెరతీస్తున్నారు. తాడేపల్లి మండలం మొదలు రేపల్లె మండలం వరకు కృష్ణా తీరంలో ఇసుక దందాకు అడ్డేలేకుండా పోతోంది. బ్యారేజి దిగువున గుంటూరు జిల్లాలో చిర్రావూరు, గుండిమెడ, పెదకొండూరు, అత్తలూరివారిపాలెం, వల్లబాపురం, మున్నంగి, కొల్లిపర, బొమ్మువానిపాలెం, చిలుమూరు, పెసర్లంక, గాజుల్లంక, జువ్వలపాలెం, ఓలేరు రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. వీటిలో మూడింటికి మాత్రమే మైనింగ్‌శాఖ అనుమతి ఇచ్చింది. మిగిలినవాటిలో స్థానిక కూటమి, వైసీపీ నేతలు హవా కొనసాగిస్తూ వసూళ్ల దందా సాగిస్తున్నారు. కొన్నిచోట్ల డబ్బు కట్టకుంటే వాహనాలు నదిలోకి దిగడానికి వీలులేదంటూ దౌర్జన్యానికి పాల్పడుతున్న పరిస్థితులూ ఉన్నాయి. రీచ్‌ల వద్ద ఉన్న వారు అడిగినట్లు నగదు ఇవ్వకుంటే నదిలోకి దిగనివ్వమంటూ అడ్డుకుంటున్నారు. కొన్ని దగ్గర్ల ఇతరుల వాహనాలు నదిలోకి దిగే గాలు మార్గానికి గుంతలతో గండ్లు కొట్టేస్తున్నారు. కొల్లూరు మండలం పెసర్లంక, గాజుల్లంక, చిలుమూరు దగ్గర అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. స్థానికంగా ఉండే ట్రాక్టర్ల యజమానుల నుంచి కూడా జనసేన, టీడీపీ నాయకులు రూ.500 కప్పం వసూలు చేస్తున్నట్లు సమాచారం. అరవింద వారధి దగ్గర డబ్బు కట్టకుండా ట్రాక్టర్లు లోనికి దిగుతున్నాయని వారం క్రితం ఎక్స్‌కవేటర్‌తో గొయ్యితవ్వించేశారు.

పంచాయతీల పేరుతో..

గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో జరిగే నిర్మాణ అవసరాలకు ఇసుకకు ప్రత్యేక అనుమతి ఉంది. ఆయా పనుల వివరాలతో పంచాయతీ తీర్మానం చేసి దాని ఆధారంగా కార్యదర్శి లేఖను ఇస్తే ఆ మండల తహసీల్దార్ సిఫార్సుతో ఇసుక లోడ్ చేసుకోవచ్చు. లేదంటే పంచాయతీరాజ్ ఏఈ లేఖ ఇచ్చినా సరిపోతుంది. అయితే కొన్ని రీచ్‌ల వద్ద నేరుగా పంచాయతీ కార్యదర్శుల పేరు, స్టాంప్‌తో చేతిరాతతో ఉన్న లేఖలను చూపి వందల ట్రాక్టర్లలో ఇసుకను తరలించుకుపోతున్నారు. ఈ లేఖలు అసలా, నకిలీనా అంటే సమాధానం చెప్పేవారు పరిశీలించే వారే లేరు. నిజాంపట్నం, కర్లపాలెం, నగరం, చెరుకుపల్లి, బాపట్ల మండలాల్లోని పంచాయతీల పేరుతో లేఖలు ఎక్కువగా వస్తున్నాయి. పంచాయతీ లేఖ ఉందని పోలీసులూ కూడా వాటిని వదిలేస్తున్నారు. దీంతో ఇసుక అక్రమార్కులకు కాసులు పండుతున్నాయి.

రాత్రిళ్లు.. లారీల్లో తరలింపు

అమరావతి మండలం దిడుగు ఇసుక రీచ్ నుంచి గతంలో లారీల్లో ఇసుక అక్రమంగా తరలించిన విషయంలో వివాదం వెలుగుచూసింది. ఇది జరిగి వారం కూడా గడవకుండానే గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఎక్స్‌కవేటర్‌తో వంద లారీలకు ఇసుక లోడ్ చేసి తరలించేశారని తెలిసింది. అనుమతి లేకున్నా, పోలీసులు కూడా అన్ని లారీల్లో ఇసుక తరలిపోతుంటే తమకేం తెలియదన్నట్లు వదిలేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఒక్కో లారీకి రూ.12 వేలు నుంచి రూ.15 వేల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. ఈ లారీలన్నీ రాష్ట్రం దాటిపోతున్నాయని, మిరకొన్ని బల్క్ కింద రేటు మాట్లాడుకుని అవసరం ఉన్న పెద్ద బిల్డర్లకు దింపేస్తున్నారని సమాచారం.

బుసక పేరిట తమ్ముళ్ల మేత

సీఎం చంద్రబాబు హెచ్చరికలు, ఇసుక తవ్వకాలకు నిబంధనలను పట్టించుకోకుండా కొందరు నేతలు అధికారిక దందా చేస్తున్నారు. ఎక్కడైనా అధికారులు అడ్డుకుంటే తాము తవ్వుతున్నది ఇసుక కాదని బుసక అని ఎదురుదాడికి దిగుతున్నారు. బుసక అయినా అనుమతులు ఉండాలన్నా పట్టించుకోవడవడంలేదు. బాపట్ల జిల్లాలో చీరాల, వేటపాలెం, చినగంజాం, బాపట్ల రూరల్ మండలాల పరిధిలో అక్రమార్కులు ఏకంగా ఎక్స్‌వేటర్లతో ఇసుకను తవ్వి రవాణా చేస్తున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని ఇటీవల చీరాల టుటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలిస్తే వారిపైనే అక్రమార్కులు ఎదురుదాడికి దిగారు. బాపట్ల రూరల్ పరిధిలోని బధిరుల పాఠశాల వెనక అనుమతులు లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు. కర్లపాలెం మండల పరిధిలోని దుండివారిపాలెం పంచాయతీ పరిధిలో కూడా ఇసుక అక్రమ తవ్వకాలు ఇష్టారీతిన జరుపుతున్నారు. అధికారపార్టీ ద్వితీయశ్రేణి నేతలే ఇసుక అక్రమ తవ్వకాల వెనుక ఉండటంతో కొందరు అధికారులు పట్టీపట్టనట్లుగా ఉన్నారు. బాపట్ల పరిధిలో పలు ప్రాంతాల్లో ఇసుక భూముల్లో పది నుంచి 15 అడుగుల వరకు లోతు పెట్టి మరీ తవ్వేసి తరలించుకుపోతున్నారు. ఒక్కో ట్రాక్టర్ రూ.5వేల నుంచి రూ.6వేల వరకు అమ్మేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులంతా బాపట్లలో ఉన్నా అక్రమ దందా యథేచ్ఛగా సాగుతుంది.

బాలికల లీగ్ మ్యాచ్ ఫలితాలు



శరభయ్య గుప్తా హైస్కూల్ క్రీడా మైదానంలో బాలికల ఫుట్‌బాల్ పోటీలు

సత్తెనపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ - 19 బాలుర, బాలికల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ - 19 బాల బాలికల పోటీల్లో ఫలితాలు ఇలా ఉన్నాయి. బాలికల లీగల్ మ్యాచ్ ఫలితాలు...చిత్తూరు జిల్లా జట్టు కృష్ణా జిల్లా జట్టుపై 3-0 గోల్ తేడాతో విజయం సాధించింది. విశాఖపట్నం జిల్లా జట్టు నెల్లూరు జిల్లా జట్టుపై 6-0, తూర్పు గోదావరి జిల్లా జట్టు కర్నూలు జిల్లా జట్టుపై 1-0 తేడాతో, చిత్తూరు జిల్లా జట్టు నెల్లూరు జిల్లా జట్టుపై జరిగిన మరొక మ్యాచ్‌లో 5-0 తేడాతో, విశాఖపట్నం జిల్లా కృష్ణా జిల్లా జట్టుపై 3-0 తేడాతో, అనంతపురం జిల్లా జట్టు తూర్పు గోదావరి జిల్లా జట్టుపై 10-0 తేడాతో, అనంతపురం జిల్లా కర్నూలు జిల్లా జట్టు పై 4-0 తేడాతో విజయం సాధించాయి. బాలుర లీగ్ ఫలితాలు ఇలా ఉన్నాయి. విజయ నగరం జిల్లా జట్టు పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై 1-0 తేడాతో, చిత్తూరు జిల్లా జట్టు తూర్పు గోదావరి జిల్లా జట్టుపై 1-0 తేడాతో, కర్నూలు జిల్లా జట్టు నెల్లూరు జిల్లా జట్టుపై 2-0 తేడాతో విజయం సాధించాయి. విశాఖపట్నం-కృష్ణా జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 0-0 తేడాతో డ్రాగా ముగిసింది. శ్రీకాకుళం జిల్లా జట్టు, ప్రకాశం జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్ కూడా 0-0 తేడాతో డ్రాగా ముగిసింది.

జగన్ చట్టాలపై మాట్లాడుతుంటే...
దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది



కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన జగన్‌రెడ్డి చట్టం, రాజ్యాంగం గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. బెంగళూరు నుంచి తాడేపల్లి వచ్చి బురదజల్లే కార్యక్రమాలు మానుకోవాలని హితవు పలికారు. గత ఐదేళ్లలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని మరచిన జగన్‌రెడ్డికి నాడు చట్టం, 41ఏ, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ గుర్తుకురాలేదా అని మండిపడ్డారు. గతంలో 41ఏపై ఏ రోజైనా నోరు తెరిచారా అని ప్రశ్నించారు. పోలీస్ యంత్రాగాన్ని ఉపయోగించి ఏ విధంగా ప్రతిపక్షాల మీద, ప్రజల పైన దాష్టికాలు చేశావో మర్చిపోయావా అని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు పర్యటనను అడ్డుకొని దాడి చేస్తే డీజీపీతో భావ ప్రకటన స్వేచ్ఛ అంటూ నీతి వాక్యాలు మాట్లాడించారని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఆయన కుటుంబంపై, పవన్ కల్యాణ్ కుటుంబంపై దుర్మార్గంగా పోస్టులు పెట్టించి నేడు నీతి వాక్యాలు వల్లిస్తున్నారని మండిపడ్డారు. సభ్య సమాజం తలదించుకునేలా పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటే నేడు చట్టాల గురించి మాట్లాడుతున్నారా అని ప్రశ్నించారు. విద్యా వ్యవస్థలో చేసిన తప్పుడు విధానాల వల్ల రెండు లక్షల మంది విద్యార్థులు విద్యకు దూరం అయ్యారన్నారు. నాడు నేడు పేరుతో వేలకోట్లు దోచుకొని తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించారని ఆరోపించారు.

నేడు, రేపు పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ క్యాంపెయిన్ డే

గుంటూరు సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల నేపథ్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో జిల్లా లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహించనున్నట్టు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. స్పెషల్ సమ్మరి రివిజన్ 2025లో భాగంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో 1.1.2025 నాటికి 18 సంవత్సరాలు నిండే వారు, ఇప్పటి వరకు ఓటు హక్కు లేని వారు ఫారం 6ను, ఓటర్ లిస్టుపై అభ్యంతరాలకు ఫారం-7ను, ఓటు వివరాలు తప్పుగా నమోదు అయినవారు ఫారం 8ను బూత్ లెవల్ అధికారులకు ఇవ్వచ్చని పేర్కొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 586.80 అడుగులు ఉంది. ఇది 304.46 టీఎంసీలకు సమానం. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 59,696 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

అంతర్ రాష్ట్ర గజదొంగ అరెస్టు

● రూ. పది లక్షల బంగారు, వెండి వస్తువులు స్వాధీనం
● నిందితుడిపై రాష్ట్ర వ్యాప్తంగా 150కి పైగా కేసులు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

మంగళగిరి సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వరుస చోరీలకు పాల్పడుతున్న గజదొంగను మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై రాష్ట్రంలోని వివిధ పోలీసు స్టేషన్లలో 150కి పైగా కేసులు నమోదయ్యాయి. ఈ వివరాలను గుంటూరు నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన తోట శివకుమార్ అలియాస్ శివ విశాఖపట్నంలో స్థిరపడి నేర సామ్రాజ్యానికి తెరతీశాడు. తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడ్డాడు. చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి రావడం, తిరిగి నేర ప్రవృత్తిని కొనసాగించడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో గత నెల 29వ తేదీన రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన తరువాత మంగళగిరి మండలం ఎర్రబాలెం, నవులూరు గ్రామాల్లో వరుసగా ఏడు చోట్ల చోరీలకు పాల్పడ్డాడు. కేసును ఛాలెంజింగ్‌గా తీసుకున్న పోలీసులు నిందితుడి కోసం విస్తృతంగా గాలించారు. ఎట్టకేలకు నిందితుడు శివతోపాటు అతనికి సహకరించిన యిమ్మిడి నాగేశ్వరరావులను శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 90 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండున్నర కిలోల వెండి, బంగారు తాపడంతో తయారు చేసిన రెండు చేతి గడియారాలు, ద్విచక్ర వాహనం కలిపి మొత్తం రూ.పది లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన మంగళగిరి రూరల్ పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ అభినందించి రివార్డులను అందజేశారని చెప్పారు. మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

అపోలో డెంటల్ హాస్పిటల్‌లో ఉచిత వైద్య పరీక్షలు

గుంటూరు మెడికల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం ఒకటో లైన్‌లో గల అపోలో డెంటల్ హాస్పిటల్‌లో రోగులకు ఉచితంగా ప్రతి రోజూ దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అపోలో హాస్పిటల్స్ యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. రోగులకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ కార్డుపై ఉచితంగా దంత చికిత్సలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు 8926378378 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

డీఎస్సీ శిక్షణకు నిర్వహించే స్ర్కీనింగ్ టెస్టు వాయిదా

గుంటూరు(విద్య), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిరుపేద ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ కోసం నిర్వహించే స్ర్కీనింగ్ టెస్టు వాయిదా వేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.మధుసూదనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రభావం కారణంగా పరీక్ష వాయిదా వేశామని, ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

నేటి నుంచి బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు

ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అండర్ 17 రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ ఆటల పోటీలు మండల పరిధిలోని యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజ్ సెక్రటరీ బత్తుల గంగాధర్‌రావు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పోటీలకు 420 మంది క్రీడాకారులు హాజరు అవుతున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం జాతీయ రహదారి పక్కన ప్రత్యేకంగా క్రీడా మైదానం సిద్ధం చేసినట్లు తెలిపారు. పోటీలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రారంభిస్తారని హెచ్ఎం నాగేశ్వరరావు తెలిపారు.

0.9866 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో గురువారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 0.9866 ఎంయూల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం చెప్పారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి నీటి రాక పూర్తిగా నిలిచిపోయిందన్నారు. రిజర్వాయర్‌లో 74.34 మీటర్ల మేర నీరుండగా 6.3030 టీఎంసీలకు సమానమన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 8,788 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 12వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. అవి పవర్ జనరేషన్ ద్వారా కృష్ణానదికి వస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

41,224 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 37,450 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 41,224 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 23,623 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	15000	334	8500	15500
నెంబరు. 5	8500	11900	నెంబరు. 5	95000	11500
273	11000	11500	273	10500	10500
341	8000	14000	341	9000	14500
4884	--	--	4884	11500	11500
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	17500	తేజ	8200	17200
బ్యాడిగి	8000	14500	బ్యాడిగి	9000	13000
దేవనూరు డీలక్స్	9900	13000	దేవనూరు డీలక్స్	8500	14000
తెల్లకాయలు	4500	11500	తెల్లకాయలు	5000	10500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి దంపతులు


ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్లలో గల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అయ్యప్పస్వామి పడిపూజను వైభవంగా నిర్వహించారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, శోభారాణి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. హరిహర పుత్రుడు అయ్యప్పకు 18 రకాల అభిషేకాలు జరిపారు. గురుస్వామి బాలకృష్ణ 18 మెట్లపై కర్పూర దీపాలను వెలిగించి భక్తులకు హారతులు అందించారు. అనంతరం భక్తులు, మాలధారులు, గ్రామస్తులకు సేవా సంఘం ఆధ్వర్యాన భిక్ష అందించారు.

స్కిల్ నైపుణ్య గణనపై శిక్షణ తరగతులు

వెల్దుర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న నైపుణ్య గణన సర్వేపై మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయ సిబ్బంది శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో ప్రసాద్ ఆధ్వర్యాన జరిగిన ఈ తరగతుల్లో స్కిల్ సెన్సెస్ కోఆర్డినేటర్ కిరణ్‌నాయక్ పలు సూచనలు చేశారు. మొబైల్ అప్లికేషన్‌పై అవగాహన కల్పించారు. ఎంపీడీవో ప్రసాద్ మాట్లాడుతూ 15 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు వారికి సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● గురజాలటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో గౌసియాబేగం ఆధ్వర్యాన నైపుణ్య గణనపై సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో గౌసియా బేగం నైపుణ్య గణన సర్వేపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొబైల్ అప్లికేషన్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌డీసీ అధికారి మహిధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● రాజుపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం గ్రామంలో ఉన్న మండల పరిషత్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన ఎంపీడీవో జీవి సత్యనారాయణ సర్వే చేయాల్సిన అంశాలపై సచివాలయ ఉద్యోగులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. అనంతరం చైల్డ్ మ్యారేజ్ నిరోధించడానికి సచివాలయంలోని వివిధ స్థాయిల సిబ్బంది పాత్రను గురించి గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దుర్గేశ్వరరావు, పంచాయితీ విస్తరణ అధికారి ముక్కంటి ఉన్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తికి సకాలంలో అందని వైద్యం

- పరిస్థితి విషమించడంతో నరసరావుపేట తరలింపు
- వైద్యుల తీరుపై బాధిత కుటుంబసభ్యుల ఆగ్రహం


గురజాల ప్రభుత్వ వైద్యశాలలో బ్రహ్మాజీ

గురజాలటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి పురుగుల మందు తాగడంతో అతని కుటుంబసభ్యులు గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు.. అప్పటికే ఆ వ్యక్తి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు.. ఆసుపత్రికి తీసుకొచ్చి గంట సేపు గడుస్తున్నా వైద్యులు చికిత్స అందించకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. ఆ తరువాత పరీక్షించిన వైద్యులు నరసరావుపేటకు రిఫర్ చేశారు.. వివరాల్లోకి వెళ్తే.. గురజాల మండలం సత్యనారాయణపురం క్యాంపునకు చెందిన గారపాటి బ్రహ్మాజీ కుటుంబ సమస్యలతో శుక్రవారం తెల్లవారుజామున పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఉదయం 8 గంటల కల్లా పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. అప్పటికే బ్రహ్మాజీ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అయినప్పటికీ వైద్యులు గంట దాకా అతనికి చికిత్సనందించలేదంటూ బాధిత కుటుంబసభ్యులు ఆసుపత్రిలో ఆందోళనకు దిగారు. బాధితుని బంధువులు హాస్పిటల్ వద్దకు పెద్ద ఎత్తున చేరుకొని ఆగ్రహం వ్యక్తం చేయడంతో అప్పుడు స్పందించిన వైద్యులు వైద్యం మొదలుపెట్టారు. అప్పటికే పరిస్థితి విషమించిందని చెబుతూ మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు రిఫర్ చేశారు. సకాలంలో వైద్యం అందించి ఉంటే పరిస్థితి విషమించేది కాదంటూ బాధితుని కుటుంబసభ్యులు, బంధువులు ప్రభుత్వాసుపత్రి వైద్యులపై మండిపడుతున్నారు.

బాలల హక్కులపై అవగాహన సదస్సు


బాలికల చట్టాలపై కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

పిడుగురాళ్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో బేటి బచావో...బీటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలల రక్షణపై అవగాహన సదస్సు జరిగింది. ఎంపీడీవో సిహెచ్ రామచంద్రరావు మాట్లాడుతూ బాలికల పరిరక్షణ, రక్షణ బాధ్యత సమాజంలో ప్రతిఒక్కరిపై వుందని, బాల్య వివాహాలతో వచ్చే అనర్థాల గురించి వివరించారు. బాలల రక్షణ అధికారి కృష్ణారెడ్డి, పిడుగురాళ్ల సిడిపిఓ రుక్సానాబేగం మాట్లాడుతూ మైనారిటీ తీరని బాలికలకు వివాహాలు జరుపుతున్నట్లైతే తమకు సమాచారం అందించాలని, వివాహ వయసు రాకుండా బాల్యవివాహాలు జరిపే తల్లిదండ్రులపై కూడా కఠిన చర్యలు వుంటాయని తెలిపారు. బాలికల ఆరోగ్యం, రక్తహీనతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మెడికల్ ఎఎన్ఎం, వెల్ఫేర్ అధికారులు, సచివాలయం ఉద్యోగులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

● రెంటచింతల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బాలికల్లో అక్షరాస్యత శాతం పెంపొందించడానికి కృషి చేయాలని ఎంపీడీవో సరోజనిదేవీ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బాలికల హక్కులను గురించి అవగాహన కల్పించాలని బాల్య వివాహాలు నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఏ.నాగమణి, వై.శ్రీదేవి, డాక్టర్ కృష్ణారెడ్డి, ప్రదీప్ రెడ్డి, ఈవో పీఆర్డీ శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో డిప్యూటీ తహసీల్దార్ మృతి


లక్ష్మణరావు(ఫైల్)

సత్తెనపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చిలకలూరిపేట మండల పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న వై.లక్ష్మణరావు (53)శుక్రవారం సత్తెనపల్లి మండలం కొమెరపూడి రైస్ మిల్లులో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తుండగా గుండెపోటుతో మరణించారు. ఈ సమాచారం తెలుసుకున్న చిలకలూరిపేట తహసీల్దార్, సిబ్బంది సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు వచ్చి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కాచవరం మాజీ సర్పంచ్ అంకిరెడ్డి...

కారంపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచవరం గ్రామ మాజీ సర్పంచ్, వైసీపీ నేత, ఆర్ అండ్ బి కాంట్రాక్టర్ కిస్టపాటి అంకిరెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న అంకిరెడ్డి శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన పార్థివదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. పలువురు ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

10న చదరంగం పోటీలు

మాచర్లటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోదండ రామాలయంలో ఈనెల 10న వాసవీ క్లబ్, మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యాన పల్నాడు చెస్ అకాడమి సహకారంతో నియోజకవర్గస్థాయి చెస్‌పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు, చెస్ కోచ్ కిరణ్ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. వివరాలకు సెల్: 9849065882, 9390059759లను సంప్రదించాలన్నారు.

దొంగల ఆచూకీ లభ్యం

రెంటచింతల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంచికల్లు గ్రామంలో గురువారం రాత్రి జరిగిన దొంగతనానికి సంబంధించిన మిస్టరీని పోలీసులు చేధించారు. శీలంనేని అనంతరామయ్య గృహంలో జరిగిన చోరీలో 12.50 శొరీల బంగారం అపహరణకు గురైంది. వీటి విలువ లక్షల్లో ఉంటుంది. కుమారుడు గోపి పెళ్లి వేడుకలకు సంబంధించి శుభలేఖలు ఇవ్వడానికి అనంతరామయ్య, మంగమ్మ దంపతులు ఇతర గ్రామాల్లోని బంధువుల ఇళ్లకు వెళ్లారు. ఇంటికొచ్చే సరికి బంగారం గొలుసులు మాయమయ్యాయి. గన్నవరం గ్రామానికి చెందిన ఇంట్లో ముగ్గురు వ్యక్తులను ఉంచి వారికి పెయింటింగ్ వేసే బాధ్యతలు అప్పగించారు. వారిలో ఇద్దరు ఈ చోరీకి పాల్పడ్డట్టు ఎస్ఐ నాగార్జున తెలిపారు.

పోటీలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి : కన్నా


ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పోటీలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని శరభయ్య గుప్తా క్రీడా ప్రాంగణంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 బాలుర, బాలికల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో క్రీడాకారులకు ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. చదువుతో పాటు బాల బాలికలు క్రీడల్లో రాణించాలన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, నూర్ బాషా జాన్‌బాబు, పూజల వెంకట కోటయ్య, కట్టా శంకరరావు, దరువూరి నాగేశ్వరరావు, మక్కెన అచ్చయ్య, కంభాల వెంకటేశ్వరరావు, తోట నరసయ్య, బత్తుల వెంకటస్వామి, పలువురు పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

శాశ్వత సభ్యత్వాలు తీసుకున్న పోతుగంటి, చిన్నయ్య

సత్తెనపల్లి పట్టణానికి చెందిన టీడీపీ నేతలు బోడపాటి లక్ష్మీ చిన్నయ్య, పోతుగంటి రామకోటేశ్వరరావు శుక్రవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చేతుల మీదుగా టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఇరువురు చెరో లక్ష రూపాయలు సభ్యత్వానికి చెల్లించారు. ఇరువురిని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామ, మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. సభ్యత్వ నమోదులు కూడా అధిక సంఖ్యలో చేయించాలన్నారు. కార్యకర్తల కుటుంబాలకు పార్టీ సభ్యత్వ నమోదు భరోసా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, నాయకులు పోట్ల ఆంజనేయులు, మార్కెట్ రాజు, పూజల వెంకట కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతికల్యాణంలో పాల్గొన్న సాయినిఖిల్

పిడుగురాళ్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో గల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం 20వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం దేవాలయంలో పూజా కార్యక్రమాలు, శాంతి కల్యాణం జరిగాయి. పట్టణంలోని భక్తులు, మహిళలు దేవాలయంలో జరిగిన ప్రత్యేక పూజలు, శాంతి కల్యాణంలో పాల్గొన్నారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు సాయినిఖిల్ కూడా స్వామివారిని దర్శించుకొని శాంతికల్యాణంలో పాల్గొన్నారు. దేవాలయ కమిటీ సభ్యులు నిఖిల్‌ను సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.


సాయినిఖిల్‌కు ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకుడు

నేడు వైద్యశిబిరం

పిడుగురాళ్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మైసూర్ ఫ్రీ మెడికల్ వారి గుండెజబ్బుల వైద్యశిబిరం శనివారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో జరగనుంది. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. పిడుగురాళ్ల ముస్లిం మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో జరిగే వైద్యశిబిరంలో డాక్టర్ హరుణ్ రషీద్ గుండెకు సంబంధించినవైద్యచికిత్సలు నిర్వహిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించిన అధికారులు

దాచేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ కార్యాలయం సమీపంలో గత కొన్నేళ్లుగా లోవోల్టేజి సమస్య స్థానిక ప్రజలను ఇబ్బంది పెడుతుంది. ఈ సమస్యను పరిష్కరించాలని గత వైసీపీ ప్రభుత్వంలో స్థానిక ప్రజలు పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన అధికారులు ప్రజాప్రతినిధుల సహకారంతో ఎట్టకేలకు శుక్రవారం 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో ఏఈ భగవాన్ నాయక్, ఎల్ఐ వెంకట్రావు, రామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శివనాగేంద్ర, గాండ్ల గణేష్, ఎఎల్ఎం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతారామ్ నియామకంపై నాయీబ్రాహ్మణుల హర్షం

దాచేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణులకు రాష్ట్రస్థాయి చైర్మన్ పదవి ఇప్పించి రాష్ట్ర వ్యాప్తంగా వారికి గుర్తింపు తెచ్చిన ఘనత గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకే దక్కుతుందని మండల నాయీబ్రాహ్మణ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు గుంటుపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. దాచేపల్లిలోని శ్రీ రంగనాయక స్వామి దేవాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. చిత్తూరు జిల్లాకు చెందిన వైద్యం శాంతారామ్‌కు టీటీడీ పాలకమండలి సభ్యుడిగా ఇవ్వడం జరిగిందని, ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు, శాంతారామ్‌కు అభినందనలు తెలిపారు.

104 సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని వినతి

దాచేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబ జీవనం భారంగా మారిందని, తమను ఆదుకోవాలని 104 సిబ్బంది శుక్రవారం దాచేపల్లి తహసీల్దార్ వైవి కుటుంబరావు, ఎంపీడీవో రామకృష్ణలకు వినతిపత్రం అందజేశారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్‌ను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు.

తూనికలు, కొలతల అధికారుల తనిఖీలు

మాచర్లటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో శుక్రవారం తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ షేక్ జాన్‌సైదా దాడులు నిర్వహించారు. పండ్ల వ్యాపారుల కొలతల్లో వ్యత్యాసంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేజీకి ముప్పావు కేజీ మాత్రమే తూకం రావడంపై ఆగ్రహించారు. అనంతరం దుకాణాలను తనిఖీ చేశారు. కొబ్బరి బొండాల విక్రయ వ్యాపారులకు పలు సూచనలు చేశారు.

రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా చిట్టిప్రోలు

మాచవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా చిట్టిప్రోలు నరసింహారావు ఎన్నికయ్యారు. రెండు రోజుల క్రితం జరిగిన ఆర్యవైశ్య మహా సభలో చిట్టిప్రోలు నరసింహారావును యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. మాచవరం గ్రామానికి చెందిన నరసింహారావు ఎంపికపై స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు అభినందనలు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని నరసింహారావు తెలిపారు.

ఏరియా వైద్యశాలను పరిశీలించిన ఇంటర్నేషనల్ టీమ్


రోగులతో మాట్లాడుతున్న ఇంటర్నేషనల్ టీమ్ సభ్యులు

సత్తెనపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏరియా వైద్యశాలను ఇంటర్నేషనల్ టీమ్ మానిటరీ కేర్ క్యాంపెయిన్‌లో భాగంగా సత్తెనపల్లి ఏరియా వైద్యశాలను శుక్రవారం సాయంత్రం సందర్శించారు. ఏరియా వైద్యశాలలో మాతా శిశు సంరక్షణకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. బాలింతలతో ప్రత్యేకంగా మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. శిశువులకు అందిస్తున్న సౌకర్యాలను కూడా పరిశీలించారు. మాతా శిశు సంరక్షణకు ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆస్పత్రి డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది అందిస్తున్న సేవలను కొనియాడారు. జాక్ ప్లైసీ ఇంటర్నేషనల్ అబ్జర్వర్స్ జాస్మిన్ సోషల్ ఇన్వెస్ట్‌మెంట్ టీమ్ సభ్యులు డాక్టర్ హేమంత్ కుమార్, డాక్టర్ వాసవి, డాక్టర్ సందీప్, డాక్టర్ డిప్పల్లి తదితరులు పాల్గొన్నారు. వారు ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ లక్ష్మణరావు నుంచి పూర్తి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల డాక్టర్లు, హెడ్, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

గులాబీ పూలతో రసీదులు అందజేత


గులాబీ పూలు అందిస్తున్న మునిసిపల్ మేనేజర్ సాంబశివరావు

సత్తెనపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘంలో 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు, నీటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించిన పలువురికి శుక్రవారం మునిసిపల్ మేనేజర్ నెట్టెం సాంబశివరావు గులాబీ పూలు అందించి రసీదులు అందించారు. పన్నులు చెల్లించే వారిని ప్రోత్సహించేందుకు గులాబీలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి రెండవ అర్థ సంవత్సరానికి ఎటువంటి వడ్డీ లేకుండా పన్ను చెల్లించవచ్చని కమిషనర్ షమ్మి తెలిపారు. పన్ను బకాయిదారులంతా వెంటనే ఆస్తి, నీటి కుళాయి, ఖాళీ స్థలాల పన్నులు, షాపుల అద్దెలు సకాలంలో చెల్లించి పురపాలక సంఘానికి సహకరించాలని ఆయన కోరారు.

అపార్ పై ప్రతి ఒక్క కళాశాల శ్రద్ధ వహించాలి

- ఇంటర్ బోర్డు పల్నాడు జిల్లా అధికారి నీలావతి దేవి

సత్తెనపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అపార్ నమోదు పై ప్రతి ఒక్క కళాశాల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఇంటర్ బోర్డు పల్నాడు జిల్లా అధికారి నీలావతిదేవి అన్నారు. పట్టణంలోని వేదా జూనియర్ కళాశాలలో జరుగుతున్న అపార్ నమోదును శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ నమోదు విషయంలో ఇబ్బందులు ఎదురైతే సంబంధిత మండల విద్యా శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. కళాశాలల్లో ఇప్పటి వరకు నమోదైన అపార్‌పై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఆధార్ సంబంధిత సమస్యలు వస్తున్నాయని, వీటిని పరి ష్కరించేందుకు సత్తెనపల్లిలో త్వరలో ఆధార్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపినట్టు ఆమె చెప్పారు. ఆమె వెంట ఇంటర్ బోర్డు అధికారి సతీష్, ప్రిన్సిపల్ అరుణ కుమార్ ఉన్నారు. పట్టణంలోని పలు కళాశాలల్లో కూడా అపార్ నమోదును పరిశీలించారు.


వేదా కళాశాలలో అపార్ నమోదును తనిఖీ చేస్తున్న నీలావతిదేవి

తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని నిలిపిన ఎన్‌టీఆర్

ముప్పాళ్ళ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని నిలిపిన వ్యక్తి నందమూరి తారక రామారావు అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని దమ్మాలపాడులో శుక్రవారం ఎన్‌టీఆర్, నవ్యాంధ్ర తొలి స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు, గ్రామానికి చెందిన పాతూరి కొండలరావు విగ్రహా లను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.


ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ఘనంగా వినాయకుని విగ్రహ పునఃప్రతిష్ఠ

ముప్పాళ్ళ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దమ్మాలపాడులో వినాయకుని విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో గ్రామస్తులంతా పాల్గొన్నారు. దీంతో గ్రామంలో తిరునాళ్ళ వాతావరణం నెలకొంది. వీరితో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రెండు రైస్ మిల్లుల సీజ్

సత్తెనపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పట్టణ, మండలంలోని రైస్ మిల్లుల పై గురువారం రాత్రి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జరిగిన దాడుల సందర్భంగా కొమెరపూడిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర రైస్ మిల్లులో 119 టన్నులు, సత్తెనపల్లి పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో గల శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర రైస్ మిల్లులో 78 టన్నుల రేషన్ బియ్యాన్ని శుక్రవారం తహసీల్దార్ చక్రవర్తి ఆధ్వర్యంలో సివిల్ సప్లయిస్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సత్తెనపల్లిలోని ఓ గోడౌన్‌కు తరలించారు. అచ్చంపేట రోడ్డులోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర రైస్ మిల్లు లీజు దారుడు దివ్వెళ్ళ మోనీష్‌పై, కొమెరపూడిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర రైస్ మిల్లు నిర్వాహకులు కళ్ళం గంగాధరరెడ్డి పై 6(ఏ) కేసులు నమోదు చేసి సరుకును సీజ్ చేసినట్టు తహసీల్దార్ చక్రవర్తి తెలిపారు.


కొమెరపూడిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర రైస్ మిల్లులో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

బాల్య వివాహాలను అరికట్టాలి : ఎంపీడీవో

బెల్లంకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో జరిగే బాల్య వివాహాలను అరికట్టాలని మండల అభివృద్ధి అధికారి వై.హనిమిరెడ్డి అన్నారు. బెల్లంకొండ జిల్లా పరిషత్ పాఠశాల సమావేశ మందిరంలో శుక్రవారం భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిగే ప్రదేశాలను ముందుగా గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ సూపర్‌వైజర్లు పరిమళ, వనజ, ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, ఆషా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బెల్లంకొండ మండలంలో పంట కోత ప్రయోగం

బెల్లంకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోదనం రెవెన్యూ గ్రామంలో శుక్రవారం పంట కోత ప్రయోగం నిర్వహించినట్టు వ్యవసాయ శాఖ అధికారి కృష్ణయ్య పేర్కొన్నారు. పత్తి పంటలో పంట కోత ప్రయోగం నిర్వహించామని, 10/10 మీటర్ల విస్తీర్ణంలో 7.8 కిలో గ్రాముల పత్తి పంట దిగుబడి వచ్చిందన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించినట్లయితే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొంద వచ్చునని ఏవో తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది శ్యామ్ ప్రకాష్, అయ్యప్ప, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సత్తెనపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం పట్టణంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. పట్టణంలోని వినియోగ దారులు సహకరించాలని అధికారులు కోరారు.

● బెల్లంకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ మండలంలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ అన్నారు. రెండవ శనివారం కావటంతో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్టు పేర్కొన్నారు.

పెదకూరపాడులో పది గంటలకు పైగా విద్యుత్ కోత

పెదకూరపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడు మండలంలో ఉదయం 9 గంటల నుంచి విద్యుత్ కోత విధించటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎటువంటి సమాచారం లేకుండానే విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ కోతను విధించటంతో ఆస్పత్రుల్లో ఉన్న రోగులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 6 గంటల తరువాత విద్యుత్ వచ్చి పోవటంతో ప్రజలు అసహనానికి గురయ్యారు. ఈ విషయమై ఏఈ రామకృష్ణను వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యాయని దీంతో మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు.

దీక్షా స్వాములకు సద్ది

పెదకూరపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప స్వామి, శివ స్వామి, భవానీ స్వామి, నీలంపాటి అమ్మవారి మాల ధరించిన స్వాములకు తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బాష్యం ఆంజనేయులు సద్ది ఏర్పాటు చేసినట్టు శుక్రవారం తెలిపారు. ప్రతి ఏడాది పెదకూరపాడులోని శివాలయంలో మాల ధరించిన స్వాములకు డిసెంబరు 3వ తేదీ వరకు 41 రోజుల పాటు దాతల సహకారంతో సద్ది ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

14న మండల కార్యాలయం వద్ద ధర్నా

సత్తెనపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు ప్రచార యాత్రను నిర్వహిస్తున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ కుమార్ అన్నారు. సీపీఎం పట్టణ కమిటీ సమావేశం పుతుంబాక భవన్‌లో జరిగింది. సమావేశానికి మునగ జ్యోతి అధ్యక్షత వహించారు. సమావేశంలో పాల్గొన్న విజయకుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 14న మండల కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులకు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. రాజ్యాంగ విరుద్ధంగా అమలు జరపాలనుకున్న జమిలి ఎన్నికల విధానాన్ని రద్దు చేయాలన్నారు. మహిళల పై దాడులను అరికట్టాలన్నారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, ఎం.హరిపోతురాజు, కట్టా శివ దుర్గారావు, అనుముల వీరబ్రహ్మం, పీ.ప్రభాకర్, జడా రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటర్ల ప్రత్యేక నమోదు కార్యక్రమం

నకరికల్లు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని పోలింగ్ అధికారులు, బూత్ లెవల్ అధికారులు ఈనెల 9, 10 తేదీల్లో ఓటర్ల ప్రత్యేక నమోదు కార్యక్రమంలో నకరికల్లులో అందుబాటులో ఉంటారని తహసీల్దార్ కే.పుల్లారావు ఆదేశాలు జారీ చేశారు. 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరినీ ఓటర్లుగా నమోదు చేసుకొనేందుకు ఈ ప్రత్యేక ఓటర్ల నమోదును నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

మూసపోసిన వ్యవసాయానికి వారు స్వస్తి పలికారు. దీర్ఘకాలిక సాగు.. బరువైన పెట్టుబడులు పెట్టాల్సిన పంటలు వద్దనుకొని కూరగాయల బాట పట్టారు. కేవలం 45 రోజుల్లో చేతికి వచ్చే రకాలను సాగు చేస్తూ మూడు రాష్ట్రాలకు కూరగాయలు సరఫరా చేస్తున్నారు. నూతన పంథాలో పెట్టుబడులు పోగా అంతో ఇంతో వెనకేసుకుంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇదీ గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వేజెండ్ల రైతుల విజయగాథ.



మూడు రాష్ట్రాలకు కూరలిస్తున్నారు !

- వేజెండ్ల రైతుల విజయప్రస్థానం

- రకం ఏదైనా వినూత్నంగా కూరగాయలుసాగు
- దొండ, చిక్కుడు, దోస, బీర, బెండల్లో అధిక దిగుబడులు
- 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకం

గుంటూరు సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఇక్కడ కూడా అందరూ పత్తి, మిరప వంటి వాణిజ్య పంటలు వేసి చేతులు కాల్చుకున్నవారే. తెగుళ్ల ఎక్కువ కావటంతో ఆయా పంటల సాగు లాటరీగా మారిన వేళ ప్రత్యామ్నాయం వైపునకు అడుగులు వేశారు. చిన్నగా కూరగాయల సాగు ఆరంభించారు. మొదట్లో పది ఎకరాలతో కొత్త సాగు ఆరంభం అయింది. గ్రామ పరిధిలో ఉన్న సుమారు 1800 ఎకరాల సాగు భూమిలో ప్రస్తుతం చాలా వరకు కూరగాయలు, వరి పండుతున్నాయి. పంటల మార్పును సవాలుగా తీసుకున్న గ్రామ ఆదర్శ రైతులు కూరగాయ విత్తనాలు, నారు, అంట్లు ఎక్కడ బాగుంటాయో విచారించి తెలుసుకొని మరీ వాటిని తీసుకొచ్చి సాగు చేశారు. దొండ అంట్లు(మొక్కలు)కోసం గుజరాత్, బెంగాల్ వరకు వెళ్లి వస్తున్నారంటే సాగు మీద వారికున్న శ్రద్ధను అర్థం చేసుకోవచ్చు.

ఏడాది పంటే కానీ...

ఇక్కడి రైతులు ఎక్కువగా సాగుచేసే కూరగాయల పంటలో మరొకటి కనుపు చిక్కుడు ఒకటి. దాన్ని పెద్ద చిక్కుడు అని కూడా అంటారు. రాజమహేంద్రవరం సమీపంలోని రావులపాలెం నుంచి విత్తనాలు తెచ్చి సాగుచేస్తారు. కట్టే, కాపు వెరైటీ ఇక్కడ ఎక్కువగా సాగు చేస్తున్నారు. పందిరి వేసి తీగను పాకిస్తారు. మే, జూన్ తప్ప అన్ని రోజులు కాపు వస్తుంది. ఇక్కడ జనవరి నెలలో పండే మంచి చిక్కుడుతోనే ఊరగాయ పచ్చడి కూడా పెడతారు. చిక్కుడు ఎకరానికి అల్లు పెట్టించే వరకు సుమారు రూ. 60 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఆ తర్వాత తెగుళ్ల నివారణకు పైమందులు అధికంగానే పిచికారి చేయాలి. మొత్తం పెట్టుబడి రూ. 1.20 లక్షల వరకు అవుతుంది. ఎకరానికి 200 బస్తాలు(ఒక్కో బస్తా 55 కేజీల నుంచి 60 కేజీల) వరకు దిగుబడి వస్తుంది. ఇందులో కొన్ని వెరైటీలు కేవలం ఆరు నెలలు మాత్రమే పంట కాలం. అయితే చిక్కుడు ధర సంవత్సరం పొడవునా రూ.30 నుంచి రూ.120 వరకు ఉంటుంది కాబట్టి రైతుకు కలిసొస్తుంది. ఈ గ్రామంలో ఇవి గాక టమాట, దోస, బీర, బెండ, కాకర, సొర, పొట్ల కాయ వంటి కూరగాయలు సంవత్సరం పొడవునా పండుతూనే ఉంటాయి.

వేజెండ్లలో చిక్కుడు సాగు



వేజెండ్లలో పందిళ్లు వేసిసాగు చేస్తున్న దొండ తోట



ఒకసారి వేస్తే రెండేళ్లు వరకు పంట

వేజెండ్ల రైతులు ప్రస్తుతం సాగుచేస్తున్న దొండ పంటకు పెట్టుబడి ఎకరాకు రూ. 2.50 లక్షల వరకు అవుతుంది. అయితే ఒకసారి అంటు నాటితే అది రెండేళ్ల వరకు పంటనిస్తూనే ఉంటుంది. దొండలో రెండు రకాలు ఉన్నాయి. లావు దొండ, సన్న దొండ. లావు దొండలో రెండు రకాలు, సన్న దొండలో నాలుగు రకాల అంట్లు ఉన్నాయి. కొంత శ్రమతో కూడుకున్నదే అయినప్పటికీ 45 రోజుల నుంచి 60 రోజుల వ్యవధిలో కాపు చేతికి వస్తుంది. ప్రతి కోతకు ఎకరానికి 35 నుండి 40 బస్తాలు దిగుబడి వస్తుంది. వేసవి ఎండలు ఉధృతంగా ఉండే ఏప్రిల్, మే నెలలు తప్ప మిగిలిన అన్ని రోజుల్లో దొండ కాయ కాపు రైతుకు లాభ సాటిగానే ఉంటుంది. సీజన్ బట్టి ధర కాస్త అటూ ఇటూ అయినా అంతిమంగా పెట్టిన పెట్టుబడికి నష్టం అయితే రాదని రైతులు చెబుతున్నారు.

తెగుళ్ల తట్టుకోలేక ఇటువైపు అడుగులు

గవిని హరికృష్ణ, రైతు,వేజెండ్ల



మిరపలో తెగుళ్ల ఎక్కువయ్యాయి. వాటిని తట్టుకోలేక కూరగాయల సాగు వైపు అడుగులు వేశాం. ఈ సాగు బాగానే ఉంది. నష్టం అయితే రాదు. అదృష్టం బాగుంటే రూపాయి కలుస్తుంది. లేకుంటే కూలి మందం మిగులుతాయి. నేను చాలా సంవత్సరాలుగా కూరగాయలు సాగు చేస్తున్నాను. తెగుళ్ల ఇందులో కూడా వస్తాయి. ఎక్కువగా గమనించి జాగ్రత్త పడతాము. గుజరాత్, బెంగాల్ వెరైటీలు తెస్తాము.

నష్టం అయితే రాదు

శనగల వీరారెడ్డి, రైతు, వేజెండ్ల



కూరగాయల సాగు వల్ల పెద్దగా నష్టం వాటిల్లదు. ఒక సీజన్‌లో కాకపోయినా మరో సీజన్‌లో రూపాయి వస్తుంది. పెట్టిన పెట్టుబడికి దిగులుండదు. ఈ ఏడాది సాగు బాగానే ఉంది. దీంతో రైతులకు ఆదాయం ఒకింత బాగానే ఉంది. మార్కెట్‌లో రేట్లు బాగానే ఉన్నాయి. చిక్కుడు వెరైటీ కేజీ రూ. 100కి ధర తగ్గలేదు. దొండకు కూడా మంచి ధర వచ్చింది. వర్షాలకు మొదట కొంత ఇబ్బంది కలిగినా ఇప్పుడు పర్వాలేదు.



నారాకోడూరు కమీషన్ కొట్టు వద్దకు తరలించిన కూరగాయలు

నారాకోడూరు నుంచే సరఫరా...

వేజెండ్లతో పాటు మిగిలిన గ్రామాల్లో పండించిన కూరగాయల పంటను రైతులు నారాకోడూరులో కమీషన్ వ్యాపారుల వద్దకు చేరుస్తారు. ట్రాలీ ఆటోలు, ద్విచక్ర వాహనంపై కూరగాయలను కమీషన్ కొట్లకు చేరుస్తారు. అక్కడ వ్యాపారులు వాటిని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లోని సుమారు 60 మార్కెట్ల కు పంపుతారు. ఇక్కడ కూరగాయలు దిగుబడి తగ్గిందంటే ఆయా రాష్ట్రాల్లో ధరలు ఆసాంతం పెరిగిపోతాయి.

అనేక గ్రామాలకు ప్రేరణ..

వేజెండ్ల రైతులు పంటల మార్పునకు నడుం బిగించిన తర్వాత మండలంలోని మరికొన్ని గ్రామాలు కూడా అదే బాటపట్టాయి. నారా కోడూరులో చాలా కాలంగా కూరగాయలు ఉన్నప్పటికీ సుద్దపల్లి, గుండారం, గొడవర్రు, చేబ్రోలు రెడ్డిపాలెంలో మాత్రం కొన్నేళ్లుగానే ఉంది.

అనువైన భూమి..


మండలంలోని కూరగాయలు సాగుకి అక్కడి భూములు ఎంతో అనువైనవని రైతులు చెబుతున్నారు. నల్లపొలాలు కావటం, ఒండ్రు ఎక్కువగా ఉండటంతో కూరగాయల వేర్లు భూమి లోపల మూడు, నాలుగు అడుగుల వరకు వెళ్లే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. భూమి అనువైనది కావడం తోనే తాము పత్తి, మిరపకు స్వస్తి పలికి కూరగాయల సాగుకు సిద్ధం అయినట్లు చెబుతున్నారు.

వచ్చిన చోటికే రజినీ !



- చిలకలూరిపేటకు విడదల రజనీ
- తాడికొండకు బాలవజ్రబాబు
- రెండు నియోజకవర్గాలకు వైసీపీ ఇన్‌ఛార్జీల నియామకం
- సుచరిత స్థానంలో డైమండ్‌బాబుకు ఛాన్స్
- ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

గుంటూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీలో తాజా పరిణామాలపై 'ఆంధ్రజ్యోతి' వెలువరించిన కథనాలు అక్షర సత్యాలయ్యాయి. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంనుంచి ఓటమి చవి చూసిన మాజీ మంత్రి విడదల రజనీ తిరిగి చిలకలూరిపేటకు వెళుతుందని ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం నిజమైంది. అలానే గత ఎన్నికల్లో తాడికొండ నుంచి పోటీ చేసి ఓడిన మాజీ హోం మంత్రి సుచరిత కూడా నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ఏకంగా ఆ పార్టీ అధినేత జగన్‌తోనే చెప్పినట్లు కూడా కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో చిలకలూరిపేట నియోజకవర్గానికి మాజీ మంత్రి విడదల రజనీని, ఎస్సీ రిజర్వు తాడికొండ నియోజకవర్గానికి వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు)ను సమన్వయకర్తలుగా నియమిస్తూ ఆ పార్టీ అధిష్ఠానం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ మంత్రి విడదల రజనీ 2024 ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం నుంచి ఓటమి చవిచూసిన విషయం తెలిసిందే. దాంతో ఆమె తిరిగి సొంత నియోజకవర్గమైన చిలకలూరిపేటకు వెళ్లాలని, అక్కడైతేనే తనకు అనుకూల పరిస్థితులుంటాయని ఇటీవల అధినేతతో చెప్పినట్లు సమాచారం. దాంతోనే ఆమెను తిరిగి చిలకలూరిపేటకు సమన్వయకర్త బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. టీడీపీ కంచుకోట అయిన పశ్చిమ నియోజకవర్గం కంటే చిలకలూరిపేటకు వెళ్లాలని రజని భావిస్తున్నారని, అధిష్ఠానం కూడాపేటకు పంపే ప్రయత్నం చేస్తుందని ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'రజనీ పీచేముడ్' పేరుతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇదే అంశం ఇప్పుడు నిజమైంది. మరో వైపు నగర డిప్యూటీ మేయర్‌గా వ్యవహరిస్తున్న డైమండ్‌బాబును ఇటీవల వైసీపీ నగర అధ్యక్షుడుగా నియమించారు. ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన తాడికొండ నియోజకవర్గానికి డైమండ్‌బాబుకు సమన్వయకర్త బాధ్యతలు అప్పగించారు. కాగా పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త బాధ్యతలు ఎవరికిస్తారనేది ఆ పార్టీలో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. పశ్చిమ నియోజకవర్గంపై ఇప్పటికే నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు కన్నేశారు. 2024 ఎన్నికల్లో చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి బరిలో దిగిన మేయర్ కావటి మనోహర్ ఓటమి చవిచూసిన విషయం తెలిసిందే. అయితే సొంత నియోజకవర్గమైన పశ్చిమ సమన్వయకర్త బాధ్యతలు అప్పగించాలని స్వయంగా అధినేత జగన్‌ను మేయర్ అడిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పశ్చిమ నియోజకవర్గ బాధ్యతలు అధినేత ఎవరికి అప్పగిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.



డైమండ్ బాబు

ఆదివాసి యువకులను విడుదల చేయాలి

- ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం నాయకుల డిమాండ్

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని మూలవాసి బచావో మంచ్ కార్యకర్తలను చత్తీస్‌ఘడ్ రాష్ట్ర సాయిధ రిజర్వుడు పోలీసులు శుక్రవారం ఉదయం 9 గంటలకు అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని వారిని వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం డిమాండ్ చేసింది. బీజాపూర్ పోలీసులు పెట్రోలింగ్ సమయంలో అనుమానంతో ఈ అక్రమ నిర్బంధానికి పాల్పడ్డారన్నారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్ ప్రాంతంలో యువకులను సీపీఐ (మావోయిస్టు)ల పేరిట కాల్చి చంపుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో యువకుల కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయన్నారు. ఈ అక్రమ నిర్బంధం పట్ల పరిసర ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఈ చర్యల పట్ల తమ తమ ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. నిరసన ర్యాలీకి మద్దతుగా నంబి నుంచి కొండ పాలికి వెళుతున్న వారిని అనుమానంతో అదుపులోకి తీసుకున్నారన్నారు. రాత్రి సమయం కావడంతో గుండిర్‌గూడలో నిద్రిస్తున్నవారిని కూడా వదిలి పెట్టకుండా పోలీసులు ఈ అక్రమ అరెస్ట్‌కు పాల్పడ్డారన్నారు. ఈ అరెస్టును పోలీసులు ధ్రువీకరించక పోవడంతో మంచ్ కార్యకర్తల కుటుంబసభ్యులు మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆ విధంగా పోలీసులు అక్రమంగా పట్టుకున్న వారిలో అర్జున్ సోధి, ముయా హేమ్లా , నగేష్ బడ్సే, జోగా మీడియం, గీల్లు కాటం, భీమా కుంజం తదితరులు ఉన్నారని పేర్కొన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న కార్యకర్తలకు ప్రాణహాని తలపెట్టకుండా విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వి.చిట్టిబాబు, రాష్ట్ర కార్యదర్శి చిలుకాచంద్రశేఖర్ డిమాండ్ చేశారు.

మోటారు సైకిళ్ళ దొంగలు అరెస్టు

- 29 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు

నరసరావుపేటరూరల్, నవంబరు 8, (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రూరల్ పరిధిలో మోటారుసైకిళ్ళను దొంగిలిస్తున్న ముఠా సభ్యులను నరసరావుపేట రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టుచేశారు. నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం మధ్యాహ్నం 12.30గంటల సమయంలో నరసరావుపేట మండలం కేశానుపల్లి గ్రామ పంచాయతీలోని బైపాస్ వద్ద నరసరావుపేట రూరల్ ఎస్ఐ, సిబ్బంది నిందితులను పట్టుకున్నారని తెలిపారు. వీళ్లు ఇళ్ళ ముందు, బార్‌ల ముందు నిలిపివుంచిన ద్విచక్ర వాహనాలను దొంగలిస్తుంటారని తెలిపారు. ఇలా ఈ ముఠా దొంగిలించిన 29 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.16 లక్షలు ఉంటుందని తెలిపారు. పట్టుబడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. పల్నాడుజిల్లాలో నేరాలు, అసాంఘిక కార్యకలాపాలను సహించబోమని, నరసరావుపేట పట్టణంలో గంజాయి, మెడికల్ మాఫీయా, పెస్టిసైడ్ మాఫీయా, పాలల్లో కల్తీ వంటి వాటిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంటుందని, ఎప్పుడైనా దాడులు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం అందించినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. వాహనదొంగలను పట్టుకొన్న రూరల్ సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

వికసిత్ భారత్‌తో స్టార్టప్‌లకు ప్రోత్సాహం

- నూతన ఆవిష్కరణలతో ముందుకు రండి
- మన దేశంలో ప్రస్తుతం 1.12 లక్షల స్టార్టప్ కంపెనీలు
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



వికాస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

తుళ్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహం ఉంటుందనీ, నూతన ఆవిష్కరణలతో ముందుకు రావాలని కేంద్ర సహాయక మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం వీఐటీ (వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) ఏపీ విశ్వవిద్యాలయంలో వికాస్ (వీఐటీ ఇన్నోవేషన్ నాలెడ్జ్ అక్విజిషన్ సమ్మిట్) నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయక మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికాస్ నిర్వహిస్తున్న వీఐటీ - ఏపీ విశ్వవిద్యాలయాన్ని అభినందించారు. ఈ వేదిక పరిశ్రమ ప్రతినిధులు, అధ్యాపకులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ఒక్కటి చేసి అంతర్జాతీయ సమస్యలకు పరిష్కారం చూపుతుందని తెలియజేశారు. సహకార పరిశోధన సృజనాత్మక ఆవిష్కరణల ద్వారా దేశాభివృద్ధికి పునాది పడుతుందని అన్నారు. 2024కు ముందు భారత దేశంలో అతి తక్కువ సంఖ్యలో స్టార్టప్‌లుండేవని, ప్రస్తుతం 1.12 లక్షల స్టార్టప్ కంపెనీలున్నాయన్నారు. యూనికాన్ నాలుగు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం 1100 ఉన్నాయని చెప్పడానికి గర్వంగా ఉందన్నారు. పలువురు పారిశ్రామిక వేత్తలతో చర్చించిన అనంతరం స్టార్టప్స్‌పై విద్యార్థులకు ఉన్న సందేహాలను మంత్రి పెమ్మసాని నివృత్తి చేశారు. వీఐటీ వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంతో ఒప్పందాలు చేసుకుంటున్న 17 మంది పరిశ్రమల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీఐటీ వైస్ ప్రెసిడెంట్ శంకర విశ్వనాథన్, శేఖర్‌విశ్వనాథన్, వైస్ ఛాన్సలర్ ఎస్వీ.కోటా రెడ్డి, రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి, వికాస్ కన్వీనర్ అమిత్ చవాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతికి గ్రామ సీమలే పట్టుగొమ్మలు

- జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రగతికి గ్రామ సీమలే పట్టుగొమ్మలని ఉమ్మడి గుంటూరుజిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. గుంటూరు నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గుంటూరు, బాపట్లజిల్లాలకు చెందిన ఎంపీడీవోలు ,ఈవోపీ ఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి పంచాయతీ రిసోర్స్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ షీలా పద్మరాణి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత స్థానిక స్వపరిపాలన సంస్థలపై ఉందని అన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఆయా సంస్థలు పరిష్కరించాలని ఆమె కోరారు. శిక్షణ పొందిన అధికారులు గ్రామాల్లో అన్నిశాఖల ఆధ్వర్యంలో ప్రణాళికను రూపొందిస్తారని పంచాయతీ రిసోర్స్‌మెంటార్, జిల్లాకోఆర్డినేటర్ షీలా పద్మరాణి తెలిపారు. గ్రామస్థాయిలో జనవరిలో, మండల స్థాయిలో ఫిబ్రవరి, జిల్లాస్థాయిలో మార్చి ఆఖరులోగా ప్రణాళికలద్వారా రూపొందించిన కార్యక్రమాలు పూర్తిచేస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో డీపీవో నాగ సాయికుమార్, జేడీ కేశవరెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో వీ.జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో పీహెచ్‌కృష్ణ, డాక్టర్‌కూచిపూడి మోహన్ రావు, కే.జియాబేగం, జిల్లాపంచాయతీ వనరుల కేంద్రం జిల్లా శిక్షణ మేనేజర్ కే.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బొమ్మ వదిలింది..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల రీసర్వేలో పాతిన హద్దురాళ్లపై ఉన్న జగన్ బొమ్మలు, పేర్లను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. ఎక్కువ నిధులు ఖర్చు చేయకుండా బొమ్మలు, పేర్లు చెరిపేయాల్సిందిగా రెవెన్యూ శాఖకు సూచించింది. దీంతో వారం, పది రోజుల వ్యవధిలోనే హద్దు రాళ్లను సాఫీగా మార్చేందుకు చర్యలు చేపట్టేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధమైంది. ఇందు కోసం శాండ్ వాష్ టెక్నాలజీని వినియోగించాలని భావిస్తుంది. ఇది ఒకవేళ ఖర్చుతో కూడుకొనేట్లయితే మాన్యువల్‌గా చేసే వారికి పనిని అప్పగించాలని యోచిస్తున్నది.

- సర్వే హద్దురాళ్లపై జగన్ చిత్రం తొలగింపునకు శ్రీకారం
- రీసర్వే జరిగిన గ్రామాల్లో దాదాపుగా
- 84 వేల రాళ్లు పాతిన గత వైసీపీ ప్రభుత్వం
- 62 గ్రామాల్లో కొద్ది రోజుల్లోనే పనులు ప్రారంభం
- రూ. 12.50 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్న ప్రభుత్వం

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే కార్యక్రమానికి వైసీపీ ప్రభుత్వం వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంగా పేరు పెట్టి అమలులోకి తీసుకొచ్చింది. గుంటూరు జిల్లాలో తొలుత ఐదు గ్రామాలను ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్టుగా అమలు చేశారు. ఆ తర్వాత మరికొన్ని గ్రామాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించారు. సాధారణంగా ఏదైనా భూముల సర్వేని ప్రభుత్వం చేపడితే హద్దురాళ్లపై ఎలాంటి పేర్లు, బొమ్మలు వేయదు. అలానే టైటిల్ డీడ్ పైనా భూహక్కుదారు పేరు మాత్రమే ఉంటుంది. అలాంటిది వైసీపీ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా టైటిల్ డీడ్‌పై జగన్ ఫోటోలను ముద్రించింది. మరోవైపు భూముల హద్దురాళ్లపై జగన్ ఫోటోలు, పేర్లు, వైసీపీ రంగులను అద్దింది. దీనిపై పలువురు భూయజమానులు అభ్యంతరం పెట్టినా పరిగణనలోకి తీసుకోలేదు. టైటిల్ డీడ్, హద్దురాళ్లపై ఫోటోలు చూస్తే అవి జగన్‌కు చెందిన ఆస్తులన్నట్లుగా చిత్రీకరణ జరిగింది. ఎన్నికలకు ముందు తెలుగుదేశంతో పాటు బీజేపీ, జనసేన పార్టీలు ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాయి. మీ ఆస్తులపై జగన్ ఫోటోలు, పేర్లు ఏమిటి. మళ్లీ అధికారంలోకి వస్తే వీటిని కొట్టేసినా/తాకట్టు పెట్టినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదని హెచ్చరించాయి. దాంతో ప్రజల్లో ఒక చర్చ జరిగింది. తమ భూములను లాక్కొంటారన్న భయం ఏర్పడింది. కాగా గుంటూరు జిల్లాలోని పలు మండలాల్లో 83,770 హద్దురాళ్లను పాతినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వాటిని తొలగించేందుకు ఒక్కో హద్దురాయికి రూ. 15 వరకు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం టెండర్లను నిర్వహించి కాంట్రాక్టర్‌ని ఎంపిక చేస్తారు. కాంట్రాక్టర్ ఎంపిక ప్రక్రియ పూర్తి అయిన తర్వాత హద్దు రాళ్లపై జగన్ బొమ్మలు, పేర్లను సమూలంగా తొలగిస్తారని రెవెన్యూ, సర్వే అధికారులు తెలిపారు.



పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

రొంపిచర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో మాధ్యూబాబుకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. తాము కొంత కాలంగా సమస్యల పరిష్కారం కోరుతూ అధికారులకు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్ర యూనియన్ ఆదేశాల మేరకు వినతి పత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. ప్రజలకు సేవ చేస్తున్న తమను గుర్తించాలన్నారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు.

డీబీటీ లబ్ధిదారుల కోసం 15 తేదీ వరకు ప్రత్యేక క్యాంపులు

● పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటస్వామి

నరసరావుపేట టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ లబ్ధిదారుల కోసం ఈ నెల 15వ తేదీ వరకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని నరసరావుపేట డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ పీ వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం పోస్టల్ ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీ వెంకటస్వామి మాట్లాడుతూ తపాల శాఖ ద్వారా ఏపీ రాష్ట్రప్రభుత్వం, తపాల శాఖ సంయుక్తంగా గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు ద్వారా ఐపీపీబీ కొత్త ప్రీమియం ఖాతాలను తెరవడం, ప్రస్తుతం ఉన్న ఐపీపీబీ ప్రీమియం ఖాతాలకు ఆధార్ లింక్ చేయడానికి ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో నరసరావుపేట ఐపీపీబీ బ్రాంచ్ మేనేజర్ మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పంటల బీమా పథకంపై శిక్షణ

రొంపిచర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల గ్రామంలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు 2024 సంవత్సరానికి రబీ సీజన్‌కు సంబంధించి పంటల బీమా పథకంపై శిక్షణా కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో ఏవో శివలలిత, ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా మేనేజర్ ఎస్ లింగయ్య, డివిజనల్ మేనేజర్ పాటిల్‌లు పాల్గొన్నారు.

మక్కాలో గోగులపాడు వాసి మృతి

రొంపిచర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోగులపాడులో హోటల్ వ్యాపారం నిర్వహించే బుడే (65) మక్కాలో ఈ నెల 7వ తేదీన మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. కొద్ది రోజుల క్రితం ఆయన తన కుమారుడితో కలసి మక్కాకు వెళ్ళారు. అక్కడ మృతి చెందగా, అక్కడే అంత్యక్రియలు జరిపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బుడేకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ దాడులు

ఈపూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఈపూరు సెక్షన్ పరిధిలో తనిఖీలు నిర్వహించి విద్యుత్ చౌర్యానికి పాల్పడిన 135మందికి రూ.7.39లక్షలు అపరాధ రుసుం వేసినట్లు డీపీఈ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ రాంబొట్లు, ఎగ్జిక్యూట్ ఇంజనీరు సీహెచ్ వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం పల్నాడు జిల్లా పర్యవేక్షక ఇంజనీరు పీ విజయకుమార్ ఆధ్వర్యంలో ఇనుమెళ్ళ, అంగలూరు, చిట్టాపురం, కే ఉప్పరపాలెం, శ్రీనగర్, వడ్డెంగుంట గ్రామాలలో 43మంది అధికారులు 126 మంది సిబ్బంది బృందాలుగా ఏర్పడి 2740 సర్వీస్‌లను తనిఖీ చేసినట్లు తెలిపారు.

ఏసుబాబు విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి, చదలవాడ

నాదెండ్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరు గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నేత, గ్రామ దేవతల దేవాలయ ధర్మకర్త గొట్టిపాటి ఏసుబాబు విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం ఆవిష్కరించారు. కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే పుల్లారావు మాట్లాడుతూ ఏసుబాబు కుటుంబీకులు గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన సతీమణి లక్ష్మీ సర్పంచ్‌గా ఉన్న హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు.

ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో రక్తదాన శిబిరం

నరసరావుపేట టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించామని రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి జన్మదినం సందర్భంగా 40 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.

కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో స్కిల్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

నరసరావుపేట టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో మేనేజర్ షేక్ నాగూర్ మహమ్మద్ ఆలీ స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. బీకామ్, బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు 30రోజుల పాటు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు.

34 మంది వాగ్దేవి విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మల్టీనేషనల్ కంపెనీ హైదరాబాద్ ఐసీఐసీఐ గ్రూప్ స్థానిక వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ విద్యార్థులకు శుక్రవారం జాబ్ ఫెయిర్ నిర్వహించారు. గ్రూప్ డిస్కషన్, జూమ్, హెచ్ఆర్ రౌండు నిర్వహించి 34మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారని ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు శిక్షణ పూర్తి అయిన తరువాత ఏడాదికి రూ 2.50 లక్షల నుంచి రూ 3.20 లక్షల వరకు జీతం ఉంటుందన్నారు.

శ్రీభవిష్య జూనియర్ కళాశాల బ్రోచర్ ఆవిష్కరణ

నరసరావుపేట టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్‌జీవో కాలనీలోని టైనీ టాట్స్ పాఠశాలలో నూతనంగా ప్రారంభించనున్న శ్రీభవిష్య జూనియర్ కళాశాల బ్రోచర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టైనీ టాట్స్ స్కూల్ డైరెక్టర్ పాతూరి శ్రీనివాసరావు, ఎంఎం కళాశాల చైర్మన్ ఎం శేషగిరిరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ వినియోగించుకునేలా చైతన్యపరచాలి

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



పీఎం సూర్యఘర్ యోజన సమీక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో సౌర విద్యుత్ వినియోగించుకునే విధంగా వినియోగదారులను చైతన్యపరచాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. శుక్రవారం నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ఆధ్వర్యంలో పీఎం సూర్యఘర్ యోజన సమీక్షా సమావేశం జరిగింది. మండలాల వారీగా పథకం అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని, వినియోగదారులను చైతన్యపరచాలని చెప్పారు. నాణ్యమైన ఫలకాలను వినియోగించేలా, నిర్వాహణ లోపాలు లేకుండా సేవలను అందించేలా, లబ్ధిదారులకు సబ్సిడీ వీలైనంత వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు కాంట్రాక్టర్లకు లేఖలు రాయాలని సూచించారు. సకాలంలో నాణ్యమైన, నిర్వహణా సేవలను అందించేలా ఆదేశించాలన్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ మాట్లాడుతూ ఈ పథకంపై విస్తృత ప్రచారాన్ని నిర్వహించాలన్నారు. గృహనిర్మాణ, టిడ్కో, పంచాయతీరాజ్, మున్సిపాలిటీలు సమన్వయంతో పనిచేసి పథకాన్ని అందరికీ వర్తింపజేయాలని సూచించారు. గృహ నిర్మాణ, టిడ్కో అధికారులు పథక లబ్ధిదారులకు అవగాహన కల్పించి, తమ ఇళ్ళకు సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు

● అనధికార నిల్వలు స్వాధీనం ● పోలీసులకు ఫిర్యాదు
● అనుమతిలేని ఎరువుల అమ్మకాల నిలుపుదల ● గోడౌన్ సీజ్


అనధికార గోదాముల్లో సోదాలు చేస్తున్న అధికారులు

వినుకొండ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందులు షాపులపై వ్యవసాయశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో స్టాక్ వివరాలు, రిజిస్టర్లు, లైసెన్సులను పరిశీలించారు. ఎరువులు వాటి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి సుమారు నాలుగు లక్షలు విలువచేసే 20 టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. మార్కాపురం రోడ్డులోని పసుపులేరు బిడ్జివద్ద ఉన్న అనదికారికంగా నిల్వచేసిన రూ.10లక్షలు విలువచేసే బయోస్టిములెంట్‌లను స్వాధీనం చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడుల్లో వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం స్క్వాడ్ సి.భవన, సురేష్, ఎడీఏ రవి బాబు, ఇన్‌చార్జి వ్యవసాయశాఖ ఏవో సుగుణ బేగం, ఏవోలు శివశంకర్‌రెడ్డి, ఎ.అంకారావు, వీఆర్వో నన్నే సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లి మండలంలో...

బొల్లాపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగుపల్లి గ్రామంలో శుక్రవారం మండల వ్యవసాయ శాఖ అధికారులు, బొలాపల్లి మండల వ్యవసాయ కమిషనర్ కార్యాలయ సహాయ వ్యవసాయ సంచాలకులు జయదేవ్‌రాజన్ ఆధ్వర్యంలో మండలంలోని గంగుపల్లిలో అనధికారికంగా నిర్వహిస్తున్న ఎరువులు, పురుగు మందుల దుకాణంపై దాడులు నిర్వహించి తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ.29,294 విలువైన ఎరువులు, రూ.2,97,460 విలువైన పురుగు మందులు సీజ్‌చేసి కేసు నమోదు చేశామన్నారు. అలాగే అనుమతులు లేని రూ.2,45,890 విలువైన బయో ఉత్పత్తుల అమ్మకాలు నిలుపుదల చేశామన్నారు. దాడుల్లో వ్యవసాయ కమిషనర్ కార్యాలయ అధికారి సురేష్, బొల్లాపల్లి ఏవో అబ్బూరి అంకారావు, వీఆర్వో నన్నే సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఈపూరు మండలంలో...

ఈపూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువులు, పురుగు మందుల షాపులపై శుక్రవారం సాయంత్రం వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.ప్రేమ్‌శేఖర్ ఆధ్వర్యంలో షాపులను తనిఖీ చేశారు. మండలంలోని ఈపూరు,అగ్నిగుండాల, ఇనుమెళ్ళ, ఊడిజర్ల, ముప్పాళ్ళ, కొచ్చెర్ల గ్రామాలలోని ఎరువులు, పురుగు మందుల షాపులను తనిఖీ చేసి రూ.7,91,203లు విలువ కలిగిన అనుమతి పత్రాలు సరిగా లేని ఎరువులు, పురుగు మందుల అమ్మకాలను నిలిపివేశారు. తనిఖీలలో వ్యవసాయాధికారులు రవికుమార్, రామారావులు పాల్గొన్నారు.


గంగుపల్లి, ఈపూరులో పురుగు మందులు, ఎరువుల షాపులను తనిఖీచేస్తున్నఅధికారులు

సర్వసభ్య సమావేశానికి ప్రజా ప్రతినిధుల డుమ్మా

● అధికారుల ఉపన్యాసాలతో ముగిసిన సర్వసభ్య సమావేశం

వినుకొండ టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేస్తేనే గ్రామాలు అభివృద్ధిచెందుతాయని ఎంపీడీవో పుట్టారెడ్డి పిలుపునిచ్చారు. వినుకొండ మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని, అధ్యక్షురాలు పగడాల జయశ్రీ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులకు బదులు అధిక శాతం షాడోలు హాజరయ్యారు. గ్రామ పంచాయతీల్లో నిధులు ఉన్నపటికీ, అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రజా ప్రతినిధులు ముందుకు రావడంలేదని, జల్‌జీవన్ పథకం కింద మంజూరైన పనులకు నిధులు ఉన్న పనులు చేపట్టకపోవడంతో, నూతనంగా టెండర్లు పిలవడం జరిగిందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆకాష్ తెలిపారు. గ్రామ పంచాయతీల్లో ఇటీవల గ్రామసభల ద్వారా మంజూరైన పనులకు శంకుస్థాపన చేపట్టినప్పటికీ పనులు చేపట్టేందుకు ఏవరూ ముందుకు రావడంలేదని అధికారులు వెల్లడించారు. ఉపాధిహామీ పథకం కింద 2024-25 సంవత్సరానికి రూ.200 కోట్లు సిద్ధంగా ఉన్నాయని ఏపీవో కట్టా నాగేశ్వరరావు తెలిపారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఎంపీడీవో పుట్టారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ విజయలక్ష్మీ, ఈవోపీఆర్‌డీ సుందర్ రెడ్డి, డీటీ మురళి, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

10న జరిగే మహా రుద్రాభిషేకానికి ఏర్పాట్లు పూర్తి

వినుకొండ నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) లోకకళ్యాణార్థం ఈ నెల 10వ తేదీన పట్టణంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో మహా రుద్రాభిషేకం పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు న్యాయవాది పోట్లూరి సైదారావు శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కాలేజీ గ్రౌండ్‌లో చేస్తున్న ఏర్పాట్లను కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు శివశక్తి లీలా ఫౌండేషన్ మేనేజర్ జి.వి రమణారావు, మోటమర్రి నరసింహారావు, జవ్వాజీ పూర్ణ, దస్తగిరి పాల్గొన్నారు.


జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయిన శంకరభారతీపురం విద్యార్థులు

జాతీయ స్థాయి పోటీలకు శంకరభారతీపురం విద్యార్థుల ఎంపిక

నరసరావుపేట రూరల్, నవంబరు 8: ఆట్యా పాట్యా, తెక్వాండోలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శంకర భారతీపురం విద్యార్థులు జాతీయ స్థాయి జట్టులో స్థానం సంపాదించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పార్వతి తెలిపారు. ఆట్యా పాట్యాలో సౌజన్య, లక్ష్మీ ప్రసూన చంద్రిక, రంగ మహాలక్ష్మీ,స్నేహారెడ్డి, వెంకట గురు ప్రశాంత్‌రెడ్డి, వరప్రసాద్ రెడ్డి ఈరోడ్, తమిళనాడు రాష్ట్రంలో ఈ నెల 8,9,10 జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారు. అలానే తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో శివసాయిశ్రీకర్, జాన్‌పాల్, దేవరాజ్ ప్రథమ స్థానం పొంది, జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందారు.

మున్సిపల్ స్టాడింగ్ కౌన్సిల్ సభ్యుడిగా రమణారావు

వినుకొండటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) వినుకొండ మున్సిపల్ స్టాడింగ్ కౌన్సిల్ సభ్యుడిగా జనసేన పార్టీకి చెందిన నాయవాది నక్క రమణారావును మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ శుక్రవారం నియమించారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు భూపతిరావు, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త నాగశ్రీనురాయల్, జనసేన పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభినందనలు తెలిపారు.

పాడి పశువుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి: ఎంపీడీవో

నరసరావుపేట రూరల్, నవంబరు 8: పాడి పశువుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో కృష్ణకుమారి తెలిపారు. నరసరావుపేట మండలం కేశానుపల్లిలో పశుగణన కార్యక్రమం పోస్టర్‌ను శుక్రవారం ఎంపీడీవో కృష్ణకుమారి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నాగనంత్, పంచాయతీ కార్యదర్శి భార్గవ్‌శ్యామ్, గ్రామ నాయకులు బసవేశ్వరరావు, గద్దె నాగేశ్వరరావు, వీరయ్య, అమర్నాద్, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో డిప్యూటీ తహసీల్దార్ మృతి


వై లక్ష్మణరావు (ఫైల్ ఫొటో)

సత్తెనపల్లి, నవంబరు 8 (ఆన్‌లైన్): చిలకలూరిపేట మండల పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న వై లక్ష్మణరావు శుక్రవారం మరణించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండలం కొమెరపూడి రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహిస్తూ మరణించారు. ఈ సమాచారం తెలుసుకున్న చిలకలూరిపేట తహసీల్దార్, సిబ్బంది సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు వచ్చి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

చెత్తసేకరణపై పారిశుధ్య కార్మికులు దృష్టి సారించాలి

● శావల్యాపురం ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటింటికీ చెత్త సేకరణపై పారిశుధ్య కార్మికులు ప్రత్యేక దృష్టిని సారించాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. ఐటీసీ సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో క్లాప్ మిత్రలు, షెడ్‌మిత్రలకు గ్రామాలలో చేపట్టవలసిన పారిశుధ్య కార్యక్రమాలు, ఆరోగ్యపరంగా తీసుకోవసిన జాగ్రత్తలు, పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, పారిశుధ్య సామగ్రి తదితర అంశాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ తిరిగి సేకరించిన చెత్తను చెత్త సేకరణ కేంద్రాలకు తరలించి ఘనవ్యర్థాల నిర్వహణను సక్రమంగా చేయాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవితభీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెత్త సేకరణ సమయంలో చేతులకు గ్లౌజులు, మాస్కులు, జాకెట్‌లను తప్పకుండా ధరించాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుగుణ, ఐటీసీ సెర్ప్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్, సిబ్బంది ఏపోబు పాల్గొన్నారు.


ఆసుపత్రి ప్రారంభోత్సవం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఐఏఎస్ కృష్ణతేజ

కందిమళ్ళ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

చిలకలూరిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సర్వీస్ రోడ్డులో కొత్తగా నిర్మించిన కందిమళ్ళ స్పెషాలిటీ హాస్పిటల్‌ను శుక్రవారం నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజతో కలిసి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. అధునాతన వైద్య సదుపాయాలు, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చిన హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ కందిమళ్ళ వాసుదేవ అంకమ్మ చౌదరి, డాక్టర్ తేజస్విలను పలువురు అభినందించారు. ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన పలు విభాగాలను శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు, చదలవాడ అరవిందబాబు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, డాక్టర్ కందిమళ్ళ జయమ్మ, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, డాక్టర్ కొల్లా రాజమోహనరావు, జక్కంపూడి సీతారామారావు ప్రారంభించారు. పారిశ్రామికవేత్త కందిమళ్ళ శ్రీనివాసరావు, వసంత ధీమంత సాయి, డాక్టర్ కొల్లా అమర్, డాక్టర్ కొమ్మినేని వీరశంకరరావు, పలువురు పట్టణ ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిరాశ్రయుల వసతి గృహాన్ని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

వినుకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాలతో పట్టణంలోని 11వ వార్డులోని మున్సిపల్ నిరాశ్రయుల వసతి గృహాన్ని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ శుక్రవారం పరిశీలించారు. వసతి గృహంలో సౌకర్యాలు, ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరా, పారిశుధ్యం, వారి భద్రత తదితర అంశాలను పరిశీలించారు. వసతి గృహంలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని, టాయిలెట్లకు మరమ్మతులు నిర్వహించాలని కమిషనర్ నిర్వాహకులను ఆదేశించారు.

మండలాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం: ఎంపీపీ రాధిక


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఈదర రాధిక

ఈపూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి పాటు పడదామని ఎంపీపీ ఈదర రాధిక అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. సమావేశానికి ఎంపీడీవో కే ప్రభాకరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి సమస్య, పారిశుధ్య సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అయా శాఖల అధికారులు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. సమావేశంలో జడ్పీటీసీ తుర్లపాటి చౌదయ్య, వైస్‌ఎంపీపీ గోలి బాగ్యలక్ష్మి, తహసీల్దారు ఏ నళిని, పంచాయరాజ్ ఏఈ హరనాథ్, నియోజకవర్గం సర్పంచ్‌ల అధ్యక్షుడు గోనుగుంట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


బొల్లాపల్లి, శావల్యాపురంలలో తహసీల్దార్ కార్యాలయాలను పరిశీలిస్తున్న ఆర్డీవో మధులత, అధికారులు

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

● నర్సరావుపేట ఆర్డీవో మధులత

శావల్యాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వివిధ రెవెన్యూ సమస్యలతో రైతులు పెట్టుకొన్న దరకాస్తులను రెవెన్యూ సిబ్బంది పెండింగ్‌లో పెట్టకుండా సకాలంలో పరిష్కరించి వారికి ఉన్నతమైన సేవలను అందించాలని నర్సరావుపేట ఆర్డీవో మధులత అన్నారు. గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలోని శావల్యాపురం మండలం పోట్లూరు రెవెన్యూ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్ స్థలాన్ని ఆర్డీవో శుక్రవారం పరిశీలించారు. అనంతరం శావల్యాపురం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ రికార్డులు, పెండింగ్ దరకాస్తులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ రీ సర్వేలో నమోదైన తప్పులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభల్లో రైతుల నుంచి వచ్చిన దరకాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ సుజాత, డిప్యూటీతహసీల్దార్ వెంకటనాగరాజు, రీసర్వే డీటీ నాసరయ్య, మండల డిప్యూటీ సర్వేయర్ రవి పాల్గొన్నారు.

బొల్లాపల్లి మండలంలో...

బొల్లాపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బొల్లాపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో కే మధులత శుక్రవారం బొల్లాపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వీఆర్‌వోలు, సర్వేయర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆలస్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. వినుకొండ నియోజక వర్గంలో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు విషయంలో రెండో స్థానం సాధించటంతో తహసీల్దార్ ఏ సుధాకర్, సిబ్బందిని ఆమె అభినందించారు. బొల్లాపల్లి కార్యాలయ పరిధిలో మొత్తం 1282 మంది ఎమ్మెల్సీ ఓట్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, వీఆర్‌వోలు, సూపరింటెండెంట్, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

మండల సమాఖ్య సర్వసభ్య సమావేశం

శావల్యాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీవోఏలు డ్వాక్రా సంఘాలకు షెడ్యూలు ప్రకారం సమావేశాలను నిర్వహించాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకిచ్చే శ్రీనిధి రుణాలను ఏడాదికి రూ.5కోట్లు అధిగమించేలా చూడాలని, డ్వాక్రా సంఘాల లావాదేవీల నిర్వహణలో పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన పేటీఎం ద్వారా రుణాలు చెల్లించే విధానాన్ని మహిళలు తప్పకుండా పాటించేలా కృషి చేయాలన్నారు. మండల సమాఖ్య ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు మాట్లాడుతూ కాలపరిమితి పూర్తయిన మండల సమాఖ్య అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు, ఉపకార్యదర్శి పోస్టులకు త్వరలో జరగనున్న ఎన్నికల్లో సమర్థులైన వారిని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో కటారపు రామారావు, మండల సమాఖ్య ఉపాధ్యక్షురాలు ఎం.వరలక్ష్మి, కార్యదర్శి గోనుగుంట్ల భారతి, కోశాధికారి వేగుల కుమారి, సీసీలు ఖాజావలి, మేరీకుమారి, కరుణమ్మ, అకౌంటెంట్ వెంకాయమ్మ పాల్గొన్నారు.